ఆంధ్రజ్యోతి

ఉష్ణోగ్రత సోమవారం గరిష్ఠం : 37.0 కనిష్ఠం : 23.0

ANDHRAJYOTHY 5 శ్రీ సత్యసాయి జిల్లా వార్తలు

మంగళవారం 1 ఏప్రిల్ 2025

భక్తిశ్రద్ధలతో ఈద్

జిల్లావ్యాప్తంగా రంజాన్ వేడుకలు



హిందూపురంలోని అల్‌హిలాల్ ఈద్గా మైదానంలో సందేశమిస్తున్న మౌలానా మన్నాన్, ప్రార్థనల్లో పాల్గొన్న ముస్లింలు



జిల్లా కేంద్రంలో ఈద్గా మైదానానికి వెళ్తున్న ముస్లింలు



శుభాకాంక్షలు చెప్పుకుంటున్న చిన్నారులు

పుట్టపర్తి రూరల్, మార్చి 31(ఆంధ్రజ్యోతి): జిల్లా వ్యాప్తంగా రంజాన్ (ఈద్-ఉల్-ఫితర్) పర్వదినాన్ని ముస్లింలు సోమవారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఉదయాన్నే మసీదులకు చేరుకుని వజూ అనంతరం ఊరేగింపుగా ఈద్గామైదానాలకు చేరుకున్నారు. సామూహిక ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. మతగురువులు మహమ్మద్‌ప్రవక్త మానవాళికి అందించిన సందేశాన్ని వినిపించారు. సామూహిక ప్రార్థనల అనంతరం ఒకరొకరు ఈద్‌ముబారక్ (రంజాన్ శుభాకాంక్షలు) తెలుపుకున్నారు. పెద్దఎత్తున హిందువులు ముస్లింలకు రంజాన్ శుభాకాంక్షలు తెలియచేశారు. ప్రార్థనలు అనంతరం ఈద్గా మైదానం నుంచి బయటకు వచ్చిన ముస్లింలకు మునిసిపల్ కమిషనర్ శీతలపానీయాలు, తాగునీటిని అందజేశారు.

కరువు మండలాలు రెండే..!

● రొద్దంలో తీవ్ర కరువు.. తనకల్లులో మోస్తరు.. ● రబీలో 30 మండలాలకు దక్కని చోటు

పుట్టపర్తి, మార్చి 31(ఆంధ్రజ్యోతి): రబీ సీజన్‌లో ప్రభుత్వం ప్రకటించిన కరువు మండలాల జాబితాలో జిల్లాలో రెండు మండలాలకు స్థానం లభించింది. 2024-25 రబీ సీజన్‌లో కరువు ప్రభావిత మండలాలను సోమవారం ప్రభుత్వం ప్రకటించింది. జిల్లాలో రొద్దం మండలాన్ని తీవ్ర కరువు ప్రాంతంగా గుర్తించింది. తనకల్లు మండలాన్ని మోస్తారు కరువు ప్రభావిత మండలంగా ప్రకటించింది. జిల్లాలోని 32 మండలాల్లో రబీ కరువు జాబితాలో రెండింటికే స్థానం దక్కింది. రొద్దం మండలం 2023-24లోనూ తీవ్ర కరువు ప్రాంతంగా నిలిచింది. మరోసారి స్థానం దక్కింది. మోస్తారు కరువు మండలంగా తనకల్లును సరిపెట్టగా.. 30 మండలాకు జాబితాలో చోటు లభించలేదు.

రబీలో నిరాశే..

ఈశాన్య రుతుపవనాలు బలహీన పడడం కారణంగా తీవ్ర వర్షాభావ పరిస్థితులు తలెత్తాయి. జిల్లాలో పలు మండలాల్లో భూగర్భ జలమట్టం పడిపోయి పంటలు చేతికందక అప్పులే మిగిలాయని రైతన్నలు ఆవేదన చెందుతున్నారు. జిల్లా అంతటా కరువు ఉన్నా.. వాస్తవ పరిస్థితులను పక్కన పెట్టి రెండు మండలాలనే ఎంపిక చేయడం గమనార్హం. దీనిపై మిగతా మండలాల రైతులు, ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గత ఖరీఫ్‌లో ప్రకటించిన కరువు ప్రాంతాల జాబితాలో 22 మండలాలకు చోటు దక్కలేదు. రబీలో కూడా రెండింటినే ఎంపిక చేయడం పట్ల జిల్లా రైతాంగం ఆందోళన వ్యక్తం చేస్తోంది. కరువు మండలంగా చోటు లభిస్తే ఆయా మండలాల్లో పంట రుణాల రీషెడ్యూల్, పంట నష్టపరిహారం, తాగునీటికి నిధులు, అదనపు ఉపాధి పనిదినాల కల్పన తదితర కరువు సహాయక చర్యలకు అవకాశం ఉంటుంది.

వీలైనప్పుడే రిజిస్ట్రేషన్



అమలులోకి స్లాట్ బుకింగ్

● దస్తావేజుల రిజిస్ట్రేషన్లకు కొత్త విధానం ● రేపటి నుంచి అమలు ● నిరీక్షణకు వీడ్కోలు

ధర్మవరం, మార్చి 31(ఆంధ్రజ్యోతి): దస్తావేజుల రిజిస్ట్రేషన్ల కోసం రాష్ట్ర ప్రభుత్వం స్లాట్ బుకింగ్(ఆన్‌లైన్ క్యూ మేనేజ్‌మెంట్)విధానం అమలులోకి తెచ్చింది. ఈ మేరకు జిల్లా రిజిస్ట్రార్ కార్యాలయానికి ఆదేశాలు అందాయి. ఏప్రిల్ 2 నుంచి ఈ విధానం అమలు కానుంది. తొలుత బుక్కపట్నం సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో ఈ విధానాన్ని ప్రారంభించి దశలవారీగా జిల్లా అంతటా అమలు చేయనున్నారు.



బుక్కపట్నం సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయం

ప్రస్తుత విధానానికి స్వస్తి

ప్రస్తుతం దస్తావేజులను సబ్ రిజిస్ట్రార్ కార్యాలయానికి తీసుకెళ్లి రిజిస్ట్రేషన్ చేసుకునే పద్ధతి అమలులో ఉంది. ఈ విధానంలో ఉదయం సబ్ రిజిస్ట్రార్ కార్యాలయానికి వెళితే సాయంత్రానికి రిజిస్ట్రేషన్ ప్రక్రియ పూర్తవుతుందో లేదో తెలియని పరిస్థితి. దీంతో క్రయ, విక్రయదారులు తమ వంతు కోసం కార్యాలయం వద్దే పడిగాపులు కాయాల్సిన పరిస్థితులు ఉండేవి. అందుకే ఈ ఇబ్బందులను తొలగించడానికి ప్రభుత్వం కొత్త విధానం తీసుకొచ్చింది. స్లాట్ బుకింగ్ చేసినప్పుడు వచ్చే సమయం ప్రకారం సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలకు వెళ్లి రిజిస్ట్రేషన్ చేయించుకోవచ్చు. ప్రస్తుతం భూములు, ఆస్తులు, వివాహాల రిజిస్ట్రేషన్లకు తప్ప మిగిలిన రిజిస్ట్రేషన్లకు ఆన్‌లైన్ సేవలు అందుబాటులో ఉన్నాయి. సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో క్యూ నిర్వహణ సరిగా లేక రిజిస్ట్రేషన్ సక్రమంగా జరగడంలేదు. దీంతో కంప్యూటర్ ఆధారిత నిర్వహణ విధానాన్ని ప్రభుత్వం తీసుకుని వచ్చింది. ప్రస్తుతం అమలులో ఉన్న పద్ధతికి స్వస్తి పలకనున్నారు. ఆస్తులు, పెళ్లిళ్ల రిజిస్ట్రేషన్లు చేయించుకునే వారు ఏప్రిల్ 2 నుంచి స్లాట్ బుకింగ్ విధానాన్ని అనుసరించాల్సి ఉంటుంది. స్లాట్ బుక్ చేసుకోకుండా నేరుగా సబ్ రిజిస్ట్రార్ కార్యాలయానికి వెళితే రిజిస్ట్రేషన్లు చేయరు. ఎంచుకున్న స్లాట్ బుకింగ్ సమయం అయిపోయిన తరువాత కార్యాలయానికి వెళ్లినా రిజిస్ట్రేషన్ చేయరు. అంటే 12గంటలకు స్లాట్ బుక్ చేసుకుని 2గంటలకు వెళితే చేయరు. ఆ రోజు సాయంత్రం 5-30గంటల తరువాత మాత్రమే వాటికి రిజిస్ట్రేషన్లు చేసే వెసులుబాటు కల్పించారు. జిల్లాలో ఏడు సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలు ఉండగా సగటున రోజుకు 300 దాకా రిజిస్ట్రేషన్లు జరుగుతుంటాయి. స్లాట్ బుకింగ్ అందుబాటులోకి వచ్చిన తరువాత నిర్ణయించుకున్న సమయంలో రిజిస్ట్రేషన్ చేస్తారు. ఒక గంట వ్యవధిలోనే రిజిస్ట్రేషన్ ప్రక్రియ ముగుస్తుంది.

బుక్ చేసుకోవడం ఇలా...

వెబ్ పోర్టల్ ద్వారా రిజిస్ట్రేషన్‌కు సంబంధించి వినియోగదారులు ఆన్ లైన్ ఫారంలో వివరాలు నింపటం ద్వారా సేవలు పొందవచ్చు. ఫారం నింపిన తరువాత అప్లికేషన్ ఐడి వస్తుంది. దాని ఆధారంగా ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్ చార్జీలు చెల్లించి, రిజిస్ట్రేషన్ కోసం స్లాట్ బుక్ చేసుకొని ఆ సమయానికి కార్యాలయానికి వెళ్లాలి.

● వెబ్ పోర్టర్ ద్వారా ప్రజలు తమకు కావాల్సిన సేవలను ఎంపిక చేసుకోవాలి. అప్పుడు క్యూఆర్ కోడ్‌తో ఒక టోకన్ వస్తుంది. ఆ క్యూఆర్ కోడ్ సబ్ రిజిస్ట్రార్ కార్యాలయానికి కూడా వెళ్తుంది.

● రిజిస్ట్రేషన్ స్లాట్ బుకింగ్‌కు ఎలాంటి ఫీజు ఉండదు. కానీ స్లాట్ రద్దు చేసుకుంటే రూ.100 చెల్లించాలి. రద్దు చేసుకున్న స్లాట్‌ను మళ్లీ బుక్ చేసుకుంటే రూ.200 ఫీజు చెల్లించాలి.

● సెలవు రోజుల్లో కూడా స్లాట్‌బుక్ చేసుకోవచ్చు. సెలవురోజుల్లో రిజిస్ట్రేషన్ చేసుకోవాలంటే రూ.5వేలు ఫీజు చెల్లించాల్సి ఉంటుంది.

● ప్రజలే నేరుగా ఆన్‌లైన్‌లో ఫారం నింపి డేటా ఎంట్రీ చేయడంతోపాటు ఎనీవేర్ విధానంలో స్లాట్ బుక్ చేసుకోవచ్చు. ఈ విధానంలో రిజిస్ట్రేషన్ తేదీ ముందు రోజు సాయంత్రం 4గంటలకల్లా రిజిస్ట్రేషన్ చేయాల్సిన ఆస్తి ఏ సబ్ రిజిస్ట్రార్ కార్యాలయ పరిధిలో ఉందో వారికి పంపాలి.

రేపటి నుంచి ప్రారంభిస్తాం - కృష్ణకుమారి, జిల్లా రిజిస్ట్రార్

జిల్లాలోని బుక్కపట్నం సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో స్లాట్ బుకింగ్ విధానాన్ని బుధవారం నుంచి ప్రారంభిస్తాం. ఈ విధానం వల్ల ప్రజలు వేచి ఉండే అవసరం ఉండదన్నారు. రిజిస్ట్రేషన్లు పారదర్శకంగా, వేగవంతంగా చేయడానికి ఈ విధానాన్ని అమలు చేస్తాం. ప్రతి రోజు ఉదయం 10-30గంటల నుంచి సాయంత్రం 5-30గంటల వరకు ప్రజలు స్లాట్ బుకింగ్ చేసుకోవచ్చు త్వరలో జిల్లాలోని అన్ని సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయాల్లో ఈ విధానం అమలు చేస్తాం.

పాపిరెడ్డిపల్లిలో పోలీస్ పికెట్

వివరాలు 7లో...

● ఘర్షణలో గాయపడ్డ లింగమయ్య మృతి ● మంత్రి సవిత, ఎంపీ పార్థసారథి నివాళి ● బందోబస్తును పర్యవేక్షించిన ఎస్పీ రత్న



భక్తి గీతాలు ఆలపిస్తున్న విద్యార్థినులు

అలరించిన భక్తి గీతాలు

పుట్టపర్తి, మార్చి 31(ఆంధ్రజ్యోతి): సత్యసాయి కళాశాల అనంతపురం మహిళా క్యాంపస్ విద్యార్థినులు ఆలపించిన భక్తిగీతాలు సత్యసాయి భక్తులను అలరించాయి. విద్యాసంవత్సరం ముగింపు సందర్భంగా సోమవారం సాయంత్రం సాయికుల్వంతు మందిరంలో విద్యార్థులు భక్తిగీతాలను ఆలపించారు. గంటపాటు సత్యసాయి ప్రేమతత్వంపై సుమధురంగా గీతాలు ఆలపించి భక్తులను రంజింపజేశారు.



ఫ్యాప్టో జిల్లా కార్యవర్గం ఎన్నిక



ఫ్యాప్టో జిల్లా అధ్యక్షుడు గజ్జల హరిప్రసాద్ రెడ్డి



జిల్లా ప్రధాన కార్యదర్శి గౌస్‌లాజం

కొత్తచెరువు, మార్చి 31(ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ ఉపాధ్యాయ సంఘాల సమాఖ్య (ఫ్యాప్టో) జిల్లా కార్యవర్గాన్ని సోమవారం ఎన్నుకున్నారు. జూమ్ కాన్ఫరెన్స్ ద్వారా ఫ్యాప్టో మునుపటి అధ్యక్షుడు కోడూరు శ్రీనివాసులు అధ్యక్షతన కార్యవర్గ ఎన్నిక నిర్వహించారు. ఎస్టీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మల్లు రఘునాథ రెడ్డి పరిశీలకుడిగా వ్యవహరించారు. ఫ్యాప్టో జిల్లా అధ్యక్షుడిగా గజ్జల హరిప్రసాద్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శిగా గౌస్‌లాజం, కోశాధికారిగా భాస్కర్‌రెడ్డిని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. సహాధ్యక్షులుగా రామకృష్ణ, షమీవుల్లా, ఉప ప్రధాన కార్యదర్శులుగా సుధాకర్, చంద్ర, హరిప్రసాద్‌రెడ్డి, కార్యదర్శిగా వెంకటనాయుడు ఎన్నికయ్యారు.



ఆలయ ఆవరణలో భక్తుల సందడి

ఖాద్రీశుడి దర్శనానికి పోటెత్తిన భక్తులు

కదిరి, మార్చి 31(ఆంధ్రజ్యోతి): పట్టణంలో వెలసిన శ్రీఖాద్రీ నరసింహ స్వామి దర్శనానికి సోమవారం భక్తులు పోటెత్తారు. వరుసగా రెండురోజులు సెలవులు కావడంతో వేలాది మంది భక్తులు వివిధ ప్రాంతాల నుంచి తరలి వచ్చారు. ఇటీవలే స్వామి వారి బ్రహ్మోత్సవాలు ముగిశాయి. బ్రహ్మోత్సవాలకు రాలేని భక్తులు శని, ఆది, సోమవారాల్లో స్వామి వారిని దర్శించుకున్నారు. ప్రత్యేక దర్శనంతోపాటు సాధారణ భక్తుల క్యూలు కూడా కిక్కిరిసిపోయాయి.

3న క్యాన్సర్ స్క్రీనింగ్ పరీక్షలు



పుట్టపర్తి, మార్చి 31(ఆంధ్రజ్యోతి): స్థానిక సత్యసాయి పాలియోటివ్ కేర్ సెంటర్‌లో ఈనెల 3వ తేదీన ఉచిత క్యాన్సర్ స్క్రీనింగ్ పరీక్షలు నిర్వహించనున్నట్లు సోమవారం ఆస్పత్రి వర్గాలు ప్రకటనలో తెలిపాయి. 35 సంవత్సరాలు పైబడిన మహిళలకు ఉదయం 10 నుంచి సాయంత్రం 3 గంటల వరకు క్యాన్సర్ స్క్రీనింగ్ పరీక్షలు నిర్వహిస్తారన్నారు. ఈ అవకాశాన్ని మహిళలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. పరీక్షలకు వచ్చేవారు 08047103700 నంబరులో సంప్రదించాలని కోరారు.

క్రైం కార్నర్

గొర్రెల కాపరి ఆత్మహత్య


మారెన్న (ఫైల్)

కూడేరు, మార్చి 31(ఆంధ్రజ్యోతి): అప్పులు చేసి కొన్న గొర్రెలు వింత వ్యాధితో చనిపోతుండటంతో మనస్తాపం చెంది కూడేరుకు చెందిన మారెన్న (44)అనే గొర్రెల కాపరి ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసులు తెలిపిన మేరకు.. మారెన్న అనే గొర్రెల కాపరి రూ.8 లక్షల విలువ చేసే 150 గొర్రెలను కొనుగోలు చేశాడు. గత కొన్ని నెలలుగా వింత వ్యాధి సోకి దాదాపు 90 గొర్రెలు మృత్యువాత పడ్డాయి. గొర్రెలు మృతి చెందుతుండటంతో అప్పులు ఎలా తీర్చాలో దిక్కుతోచక ఈ నెల 26న చెట్టుకు ఉరివేసుకొని ఆత్మహత్యకు యత్నించాడు. గమనించిన స్థానికులు పోలీసులకు సమాచారం ఇవ్వడంతో అనంతపురం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ ఆదివారం రాత్రి మృతిచెందాడు. మృతుడికి భార్య కుంటెమ్మ, ముగ్గురు కుమారులు సంతానం. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

తమ్ముడి చేతిలో అన్న హతం

లేపాక్షి, మార్చి 31(ఆంధ్రజ్యోతి): అన్నదమ్ముల మధ్య జరిగిన గొడవలో తమ్ముడి చేతిలో అన్న మరణించిన సంఘటన లేపాక్షిలో జరిగింది. ఎస్ఐ నరేంద్ర తెలిపిన మేరకు లేపాక్షి గ్రామానికి చెందిన రామాంజనేయులు(45), అశ్వత్థప్ప అన్నదమ్ములు. రామాంజనేయులు తహసీల్దార్ కార్యాలయంలో వీఆర్ఏగా విధులు నిర్వహిస్తున్నాడు. కుటంబ కలహాలతో అన్నదమ్ములిద్దరూ తరచూ గొడవ పడేవారు. ఆదివారం కూడా ఇద్దరూ మద్యం సేవించి గొడవ పడ్డారు. ఈక్రమంలోనే అశ్వత్థప్ప తన అన్న రామాంజనేయులును మిద్దెపై నుంచి కిందకు తోసేశాడు. తీవ్రంగా గాయపడిన రామాంజనేయులును కుటుంబ సభ్యు లు ఆటోలో హిందూపురం ప్రభుత్వ ఆసుపత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలో మృతి చెందాడు. మృతుడికి భార్య, కుమార్తె, కుమారుడు ఉన్నారు. భార్య రాధమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్నట్లు పోలీసులు తెలిపారు.

సచివాలయ ఉద్యోగి మృతి


శ్రీపతి (ఫైల్)

అనంతపురంరూరల్, మార్చి 31(ఆంధ్రజ్యోతి): మండలంలోని కామారుపల్లి సచివాలయంలో సంక్షేమ, విద్యాసహాయకుడిగా పనిచేస్తున్న మాసినేని శ్రీపతి (42) సోమవారం గుండెపోటుతో మృతి చెందారు. పిల్లిగుండ్ల కాలనీలో ఆయన నివాసముంటున్నారు. సోమవారం మధ్యాహ్నం గుండెపోటుతో నగరంలోని ఓ ప్రైవేట్ ఆసుపత్రిలో మృతి చెందారు. ఆయన స్వగ్రామం రాప్తాడు మండలం పుల్లల రేవు. ఆయనకు భార్య ఇద్దరు పిల్లలు ఉన్నారు. ఉద్యోగి మృతి పట్ల ఎంపీడీఓ దివాకర్, ఈఓఆర్డీ వెంకటనాయుడు ఇతర అధికారులు, సచివాలయ ఉద్యోగులు సంతాపం తెలిపారు.

మాజీ సర్పంచ్‌పై దాడి: ముగ్గురి అరెస్ట్

అనంతపురం క్రైం, మార్చి 31(ఆంధ్రజ్యోతి): మాజీ సర్పంచ్ మోహన్‌రెడ్డిపై జరిగిన దాడి ఘటనలో నాలుగో పట్టణ పోలీసులు ముగ్గురిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు పంపారు. సీఐ సాయినాథ్ తెలిపిన వివరాల మేరకు... ఈనె 24న ప్రస్తుతం నగర శివారులోని మదర్‌థెరిస్సా కాలనీలో నివాసముంటున్న రాప్తాడు మండలం గాండ్లపర్తి కొత్తపల్లి మాజీ సర్పంచ్ మోహన్‌రెడ్డి ఇంట్లోకెళ్లి ఆయనపై దాడి చేశారు. ఆయనకు తీవ్ర రక్తగాయాలు కావడంతో ఆసుపత్రికి తరలించారు. ఈ ఘటనపై పోలీసులు సోమవారం దాడికి పాల్పడిన చింతపంటి సుధాకర్‌రెడ్డి, చింతపంటి దివాకర్‌రెడ్డితో పాటు వారికి పరోక్షంగా సహకరించిన వారి సమీప బంధువు చింతపంటి శివారెడ్డిని అరెస్ట్ చేశారు. శివారెడ్డి పాత నేరస్థుడు. ఇతడు ఎర్రచందనం, హత్య కేసుల్లో నిందితుడు. వారి నుంచి రెండు బైక్‌లు, రాడ్లను స్వాధీనం చేసుకున్నారు.

పాతాళ గంగ పైపైకి..!

- ఆశాజనకంగా భూగర్భజలాలు
- తొమ్మిది నెలల్లో 4 మీటర్లపైకి..


భూగర్భ జలాల స్థాయిని లెక్కిస్తున్న అధికారులు (ఫైల్)

అనంతపురం అర్బన్, మార్చి 31(ఆంధ్రజ్యోతి): ఈసారి వర్షాలు పుష్కలంగా కురవడంతో జిల్లాలో పాతాళ గంగమ్మ పైపైకి ఎగబాకుతోంది. గతంకంటే భూగర్భజలాల స్థాయి పెరిగింది. గత తొమ్మిది నెలల్లో జిల్లాలో భూగర్భ జలాలు సరాసరిగా 4 మీటర్ల పైకి పెరిగాయి. గత ఏడాది జూన్ నుంచి ఈ ఏడాది ఫిబ్రవరి వరకు జిల్లాలో సరాసరిగా 461.5 మిల్లీ మీటర్ల వర్షపాతం నమోదు కావాల్సి ఉండగా... 601.9 మిల్లీ మీటర్లు నమోదైంది. 2024 మే నెలలో జిల్లాలో సరాసరిగా 15.22 మీటర్ల లోతులో భూగర్భజలాలు ఉండేవి. గతేడాది ఫిబ్రవరి నెలలో 12.29 మీటర్ల లోతులో భూగర్భజలాలు ఉండేవి. ఈ ఏడాది ఫిబ్రవరి నెల నాటికి 11.22 మీటర్ల లోతుకు భూగర్భజలాలు చేరుకున్నాయి. ఈ లెక్కన గత ఏడాది మే నుంచి ఈ ఏడాది ఫిబ్రవరి నాటికి జిల్లాలో సరాసరిగా 4 మీటర్లపైకి భూగర్భజలాలు పెరిగాయి. గత ఏడాది ఖరీఫ్‌లో అదనంగా వర్షపాతం నమోదు కావడంతో భూగర్భ జలాలు పెరిగాయి.

13 గ్రామాల్లో వ్యవసాయ బోర్లపై నిషేధం

జిల్లాలోని 13 గ్రామాల్లో కొత్తగా వ్యవసాయ బోర్లు వేయడంపై ప్రభుత్వం నిషేధం విధిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. జిల్లాలోని పుట్లూరు మండలం కోమటికుంట్ల, మడుగుపల్లి, తాడిపత్రి మండలం బోడాయిపల్లి, బొందలదిన్నె, హుసేనాపురం, సజ్జలదిన్నె, తాడిపత్రి రూరల్ ప్రాంతం, యల్లనూరు మండలం ఆరవేడు, బొప్పేపల్లి, మేడుకుర్తి, పెద్దమల్లేపల్లి, తిరుమలాపురం, వేములపల్లి గ్రామాల్లో కొత్తగా వ్యవసాయ బోర్లు వేయకూడదని ఉత్తర్వుల్లో పేర్కొంది. ప్రతి ఏడాది అన్ని గ్రామాల్లో నీటి లభ్యత ఎంత ఉంది..? ఎంత నీరు వినియోగం అవుతుందన్న అంశాలపై పరిశీలన చేస్తారు. జిల్లాలోని 13 గ్రామాల్లో భూగర్భ జలాల నిల్వ కంటే అధికంగా నీటి వినియోగం అవుతున్నట్లు భూగర్భజల శాఖ అధికారులు ప్రభుత్వానికి నివేదికలు పంపారు. ఈ నేపథ్యంలో ప్రభుత్వం ఆయా గ్రామాల్లో వ్యవసాయ బోర్లు వేయకూడదని జీవో జారీ చేసింది.

భూగర్భజలాలు పైకొచ్చాయి..



ఈసారి వర్షాలు బాగా కురవడంతో జిల్లాలోని అన్ని ప్రాంతాల్లో భూగర్భజలాలు పైకొచ్చాయి. గత ఏడాది జూన్ నుంచి ఈ ఏడాది ఫిబ్రవరి నాటికి జిల్లాలో సరాసరిగా 461.5 మిల్లీ మీటర్ల వర్షపాతం నమోదు కావాల్సి ఉండగా... 601.9 మీ.మీ వర్షపాతం నమోదైంది. ఈ నేపథ్యంలో భూగర్భ జలాలు గతంతో పోలిస్తే పైకొచ్చాయి. జిల్లాలోని 13 గ్రామాల్లో నీటి నిల్వ కంటే అధికంగా నీటి వినియోగం జరుగుతోంది. దీన్ని దృష్టిలో ఉంచుకొని ఆయా గ్రామాల్లో కొత్తగా వ్యవసాయ బోర్లు వేయడంపై నిషేధం విధిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. -తిప్పేస్వామి, డీడీ, భూగర్భజల శాఖ

మండలాల వారిగా భూగర్భజలాల స్థాయి ఇలా...

మండలం పేరు	2024 మే	2025 ఫిబ్రవరి (మీటర్లలో)
అనంతపురం రూరల్	9.54	10.75
ఆత్మకూరు	7.69	6.43
బుక్కరాయ సముద్రం	5.72	9.02
బెళుగుప్ప	18.48	10.70
బొమ్మనహాల్	14.38	6.89
బ్రహ్మసముద్రం	17.78	13.93
డి.హిరేహాల్	23.06	14.73
గార్లదిన్నె	4.98	3.70
గుత్తి	12.59	11.28
గుమ్మగట్ట	27.97	11.85
గుంతకల్లు	6.46	6.61
కళ్యాణదుర్గం	23.59	15.40
కంబదూరు	16.43	8.95
కణేకల్లు	22.93	11.50
కూడేరు	12.43	11.65
కుందుర్పి	17.35	13.26
నార్పల	10.23	12.33
పామిడి	15.04	12.75
పెద్దపప్పూరు	2.29	0.87
పెద్దవడుగూరు	6.87	6.91
పుట్లూరు	26.28	16.46
రాప్తాడు	7.39	4.68
రాయదుర్గం	20.73	7.83
శెట్టూరు	38.51	28.92
శింగనమల	8.26	9.02
తాడిపత్రి	14.37	14.75
ఉరవకొండ	5.56	5.63
వజ్రకరూరు	11.34	9.51
విడపనకల్లు	4.42	7.06
యాడికి	26.68	19.26
యల్లనూరు	10.45	9.69

ఉత్సాహంగా ఎద్దుల బండ్ల పోటీలు

విడపనకల్లు, మార్చి 31(ఆంధ్రజ్యోతి): మండంలోని పొలికి, విడపనకల్లు, గ్రామాల్లో ఉగాది పండుగ సందర్భంగా ఎద్దుల బండ్ల పరుగు పందేలు, ఎద్దుల బండి గిరుకు లాగుడు పోటీలను సోమవారం ఘనంగా నిర్వహించారు. విడపనకల్లులో ఊరి చివర ఎద్దుల బండ్ల పరుగు పందేలను నిర్వహించారు. ఈ పోటీలలో 9 జతల ఎద్దుల బండ్లు పాల్గొన్నాయి. నిర్దేశించిన దూరాన్ని ముందుగా చేరుకు జడప్ప ఎద్దులు మొదటి బహుమతి రూ. 5వేలను గెలుపొందాయి. రెండో బహుమతి రూ.మూడు వేలను వీరాంజి ఎద్దులు గెలుపొందాయి. మూడో బహుమతి స్టీల్ బకెట్‌ను ఎర్రిస్వామి ఎద్దులు గెలుపొందాయి.

పందెంలో అపశ్రుతి

ఎద్దుల బండ్ల పరుగు పందెంలో అపశ్రుతి చోటు చేసుకుంది. వేగంగా వెళ్తున్న ఓ ఎద్దుల బండి పల్టీ పడింది. అందులో ఉన్న ఓ రైతు కింద పడిపోయి బయటికి వచ్చాడు. ఎద్దులను అదిలిస్తున్న రైతు చాక చక్యంగా బండి కాడిని పట్టుకుని కిందకు పడకుండా కూర్చున్నాడు. పరుగెడుతున్న ఎద్దుల బండిని ఎవరూ ఆపలేకపోయారు. కొద్ది దూరం వెళ్లాక ఎద్దులు ఆగిపోయాయి. దీనితో రైతులు అందరూ ఊరిపి పీల్చుకున్నారు. రైతు గనక జారి కింద పడి ఉంటే ప్రాణాలు పోయేవని వారు పేర్కొన్నారు.


ఎద్దుల బండ్ల పరుగు పోటీ


ప్రథమ బహుమతి సాధించిన ఎద్దులతో రైతు

- మండలంలోని పొలికి గ్రామంలో ఉగాది పండుగను పురస్కరించుకుని గిరుకు బండి లాగుడు పోటీలను సోమవారం నిర్వహించారు. ఈ పోటీలలో 10 జతల ఎద్దులు పాల్గొన్నాయి. ఈ పోటీలలో ఏకల గురప్ప ఎద్దులు 4300అడుగులు దూరం గిరుకు బండిని లాగి ప్రథమ బహుమతిని గెలుచుకున్నాయి. రాయల మంజూ ఎద్దులు 3200 అడుగుల దూరాన్ని లాగి రెండో బహుమతిని, బోయ భీమేష్ ఎద్దులు 3049అడుగుల దూరాన్ని లాగి మూడో బహుమతిని గెలుపొందాయి.

నేటి నుంచే ఇంటర్ తరగతులు

అనంతపురం విద్య/కొత్తచెరువు, మార్చి 31(ఆంధ్రజ్యోతి): ఇంటర్ విద్యార్థులకు వేసవి సెలవులకు ముందే కొత్త విద్యాసంవత్సరం తరగతులు ప్రారంభం కానున్నాయి. ఏప్రిల్ 1 నుంచి 2025-26 విద్యా ఏడాది తరగతులను నిర్వహించనున్నారు. సెకెండ్ ఇయర్ విద్యార్థులకు ఏప్రిల్ 1 నుంచి ఈనెల 23వ తేదీ వరకూ తరగతులు నిర్వహిస్తారు. 24 నుంచి మే 30 వరకూ వేసవి సెలవులు ఇవ్వనున్నారు. జూన్ 1 నుంచి కొత్త విద్యా సంవత్సరం పునఃప్రారంభంకానుంది. ఈ నెల ఏడో తేదీ నుంచి ఇంటర్ ఫస్ట్ ఇయర్ అడ్మిషన్లు ప్రారంభించనున్నారు. అడ్మిషన్ల నేపథ్యంలో ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో ప్రత్యేకంగా డ్రైవ్ నిర్వహించనున్నారు. టైం టేబుల్‌లో సైతం మార్పులు తీసుకొచ్చారు. ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకూ క్లాసులు నిర్వహించనున్నారు. ఈ మేరకు ఇంటర్ విద్యలో ఇంటర్ బోర్డు సమూల మార్పులు తీసుకొచ్చింది. మంగళవారం నుంచి అన్ని జూనియర్ కళాశాలల్లో తరగతులు ప్రారంభమవుతాయని ఆర్ఐఓ వెంకటరమణ స్పష్టం చేశారు.

నేటి నుంచి రెండో ఉచిత సిలిండర్

అనంతపురం టౌన్, మార్చి31(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం మహిళల కోసం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన దీపం-2 పథకం కింద మంగళవారం నుంచి రెండో ఉచిత గ్యాస్ సిలిండర్ కోసం బుక్ చేసుకోవచ్చని ఇన్‌చార్జ్ డీఎస్ఓ జగన్నాథరావు ప్రకటనలో తెలిపారు. జిల్లాలో 5,05,831 మంది ఈ పథకం కింద ఏడాదికి మూడు ఉచిత సిలిండర్లు పొందడానికి అర్హులుగా ఉన్నారన్నారు. తొలి సిలిండర్ బుకింగ్‌కు సోమవారంతో గడువు ముగిసిందన్నారు. రెండో సిలిండర్ ఏప్రిల్ నుంచి జూలై నెలాఖరి వరకు పొందవచ్చని డీఎస్ఓ తెలిపారు. గ్యాస్ సరఫరా చేసిన వెంటనే డబ్బును ఆయా మహిళల ఖాతాల్లోకి జమ చేస్తామని పేర్కొన్నారు.

మనిషి చావుతో కుల రాజకీయాలు చేస్తారా..?

- ఐదేళ్లు ఎమ్మెల్యే, ఎంపీగా చేశారే... మీకేమైనా విజ్ఞత ఉందా..?
- ప్రకాష్‌రెడ్డి, గోరంట్ల మాధవ్‌పై ఎమ్మెల్యే పరిటాల సునీత ఫైర్



అనంతపురం, మార్చి31(ఆంధ్రజ్యోతి): 'రామగిరి మండలం పాపిరెడ్డిపల్లి ఘటనలో ఓ వ్యక్తి చనిపోతే కుల రాజకీయాలు చేస్తారా..? ఐదేళ్లు ఎమ్మెల్యే, ఎంపీలుగా పనిచేశారే... మీకేమైనా విజ్ఞత ఉందా..?' అంటూ మాజీ ఎంపీ గోరంట్ల మాధవ్, మాజీ ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డిపై రాప్తాడు ఎమ్మెల్యే పరిటాల సు నీత తీవ్రస్థాయిలో మండిపడ్డారు. ఈ మేరకు సోమవారం అనంతపురంలోని తన క్యాంపు కార్యాలయంలో ఆమె మీడియాతో మాట్లాడుతూ.... పాపిరెడ్డిపల్లిలో ఓ వ్యక్తి చనిపోతే ఆ కుటుంబం ఎంత బాధపడుతుందో తమకు బాగా తెలుసన్నారు. 'గతంలో నా భర్త, నా మామ, పరిటాల హరిని కోల్పోయిన నేపథ్యంలో మా కుటుంబమంతా కన్నీరుమున్నీరైంద'న్నారు. పాపిరెడ్డిపల్లి ఘటన చనిపోవాలని దాడిచేసింది కాదన్నారు. రాజకీయాలు, పార్టీలు, కులాలకు సంబంధమే లేదన్నారు. ఆ ఘటనను అడ్డుపెట్టుకుని పరిటాల కుటుంబాన్ని టార్గెట్ చేశారన్నారు. చనిపోయిన వ్యక్తి ఇంటి పేరు వదిలేసి ఆయన సామాజికవర్గాన్ని ప్రేరేపిస్తూ కురుబ లింగమయ్య అంటూ ఆ కులాన్ని రెచ్చగొడుతున్నారని ఆగ్రహం వ్యక్తంచేశారు. గతంలో ప్రకాష్‌రెడ్డి ఆత్మకూరులో ఒకరు వ్యక్తిగత కారణాలతో హత్యకు గురైతే... దాన్నికూడా తమపై నెట్టారన్నారు. 15 ఏళ్లుగా కులాల్ని అడ్డం పెట్టుకుని, రాజకీయాలు చేయడం ప్రజలంతా గమనించారన్న విషయాన్ని ప్రకాష్‌రెడ్డి గుర్తుంచుకోవాలని హితవు పలికారు. రాప్తాడులో సీటు కోసం మాజీ ఎంపీ గోరంట్ల మాధవ్, మాజీ ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి గొడవలు పడుతూ ప్రతిదీ తమకు ఆపాదిస్తున్నారన్నారు. పరిటాల కుటుంబం పేరు చెబితేనే పెద్ద సైకో (జగన్) దృష్టిలో పడతామన్న ధ్యాస తప్ప... వారికి వేరే పని లేదన్నారు. వారి పార్టీలో ఏం చేసుకున్నా పర్వాలేదుకానీ... తమ కుటుంబానికి, పార్టీకి ప్రతిదీ అంటగట్టడం సరైన పద్ధతి కాదని హెచ్చరించారు. కక్ష సాధింపులు అంటూ ప్రతిసారీ విమర్శలు చేస్తున్నారన్నారు. 'వైసీపీ గత ఐదేళ్లల్లో చేసిన వాటిని గుర్తుపెట్టుకొని ఉండుంటే.. మీరు ఒక్కరోజైనా తట్టుకొని ఉండేవారా' అన్నారు. ప్రకాష్‌రెడ్డి సోదరుడు... సీఎం చంద్రబాబునాయుడు, మంత్రి నారా లోకేశ్‌ను పచ్చిబూతులు తిట్టాడన్నారు. తాము కక్ష సాధించాలనుకుంటే ఏమయ్యేవారో గుర్తెరగాలని సూచించారు. కురుబలు, బోయలు తమకు కుటుంబ సభ్యుల్లాంటి వారన్నారు. కులాలతో రాజకీయాలు చేయాల్సిన ఖర్మ తమకు పట్టలేదన్నారు. పాపిరెడ్డిపల్లి ఘటనలో తప్పు ఎవరిదైనా సరే... తమ బంధువులని తాము వెనకేసుకురాలేదన్నారు. ఇప్పటికే ఒకరిని అరెస్టు చేశారన్నారు. బాధిత కుటుంబాన్ని ఆదుకునేందుకు ముందుకు రాకుండా శవ, కుల రాజకీయాలు చేస్తారా అంటూ మండిపడ్డారు. బాధిత కుటుంబానికి సాయం చేసేందుకు తాము సిద్ధంగా ఉన్నామని పరిటాల సునీత స్పష్టం చేశారు.

పాపిరెడ్డిపల్లిలో పోలీస్ పికెట్

- ఘర్షణలో గాయపడ్డ లింగమయ్య మృతి
- మంత్రి సవిత, ఎంపీ పార్థసారథి నివాళి
- బందోబస్తును పర్యవేక్షించిన ఎస్పీ రత్న

రామగిరి/చెన్నేకొత్తపల్లి/పెనుకొండటౌన్, మార్చి 31(ఆంధ్రజ్యోతి): మండలంలోని పాపిరెడ్డిపల్లిలో పోలీస్ పికెట్ ఏర్పాటు చేశారు. గ్రామంలో ఆదివారం జరిగిన ఘర్షణలో లింగమయ్య అనే వ్యక్తి మృతి చెందిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో పోలీసులు ముందు జాగ్రత్త చర్యలు తీసుకున్నారు. కాగా లింగమయ్య మృతదేహన్ని సోమవారం అనంతపురం నుంచి పాపిరెడ్డిపల్లికి తరలిస్తుండగా ఎన్ఎస్‌గేటు సమీపంలో అంబులెన్స్‌ను ఆపి మృతదేహంపై పూలమాల వేసి చేనేత జౌళిశాఖ మంత్రి సవిత నివాళులర్పించారు. హిందూపురం ఎంపీ బీకే పార్థసారథి అనంతపురంలోని ప్రభుత్వ ఆస్పత్రిలో లింగమయ్య మృతదేహంపై పూలమాల వేసి నివాళులర్పించారు. మధ్యాహ్నం లింగమయ్య మృతదేహనికి పాపిరెడ్డిపల్లి గ్రామంలో అంత్యక్రియలు నిర్వహించారు. గ్రామంలో అవాంఛనీయ ఘటనలు జరగకుండా ఎస్పీ రత్న ఆధ్వర్యంలో ధర్మవరం డీఎస్పీ హేమంత్‌కుమార్, పోలీసు బందోబస్తు నిర్వహించారు. ఉదయం నుంచే పోలీసులు గ్రామంలోకి ఎవరిని రానివ్వకుండా పికెట్ ఏర్పాటుచేశారు. కేసును నిష్పక్షపాతంగా విచారణ చేస్తామని ఎస్పీ మృతుడి కుటుంబసభ్యులకు హామీ ఇచ్చారు. మండలంలోని అన్ని గ్రామాల్లో డ్రోన్ కెమెరాలతో నిఘా పెట్టడంతో పాటు పోలీసులు పికెట్‌ను కొనసాగిస్తున్నారు.

ఎన్ఎస్ గేటులో బందోబస్తు

చెన్నేకొత్తపల్లి మండలంలోని ఎన్ఎస్‌గేటులో సోమవారం పటిష్ఠ పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు. రామగిరి మండలం పాపిరెడ్డిపల్లిలో ఆదివారం టీడీపీ, వైసీపీ శ్రేణుల మధ్య ఘర్షణ జరిగి వైసీపీ కార్యకర్త లింగమయ్య మృతి చెందాడు. లింగమయ్య మృతదేహన్ని అనంతపురం నుంచి పాపిరెడ్డిపల్లికి తరలిస్తుండటంతో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీసులు ముందుజాగ్రత్త చర్యల్లో భాగంగా బందోబస్తు చేపట్టారు. జిల్లా ఎస్పీ రత్న ఎన్ఎస్‌గేటుకు చేరుకుని బందోబస్తును పర్యవేక్షించారు.


లింగమయ్య మృతదేహం వద్ద నివాళులర్పిస్తున్న మంత్రి సవిత


నివాళి అర్పిస్తున్న ఎంపీ


పాపిరెడ్డిపల్లిలో బందోబస్తుపై సమీక్షిస్తున్న ఎస్పీ రత్న

నిందితుల అరెస్టు

రామగిరి మండలంలోని పాపిరెడ్డిపల్లిలో ఆదివారం జరిగిన ఘర్షణలో గాయపడిన లింగమయ్య చికిత్స పొందుతూ మృతి చెందాడు. మృతుడి భార్య రామాంజినమ్మ ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు ఆదర్శ్, మనోజ్‌నాయుడును అరెస్టు చేసి సోమవారం కోర్టుకు హాజరు పరిచారు. న్యాయాధికారి వారికి రిమాండ్ విధించినట్లు రామగిరి పోలీసులు తెలిపారు.

శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే సహించం : మంత్రి సవిత

రాజకీయ, వ్యక్తిగత కక్షల పేరుతో శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే సహించేది లేదని బీసీ, సంక్షేమ శాఖ మంత్రి సవిత సోమవారం ప్రకటనలో పేర్కొన్నారు. అరాచక శక్తులను ఉక్కుపాదంతో అణచివేస్తామని, రాజకీయ రంగు పులిమి ఘర్షణలు, అల్లకల్లోలం సృషించే వారి పట్ల కఠినంగా వ్యవహరిస్తామన్నారు.

మాజీ ఎంపీ మాధవ్ హౌస్ అరెస్టు


తన నివాసంలో గోరంట్ల మాధవ్, పోలీసులు

అనంతపురం క్రైం, మార్చి 31(ఆంధ్రజ్యోతి): వైసీపీ మాజీ ఎంపీ గోరంట్ల మాధవ్ రామగిరి మండలంలోని పాపిరెడ్డిపల్లికి వెళ్లకుండా పోలీసులు సోమవారం హౌస్ అరెస్ట్ చేశారు. మీడియా ఎదుట మాధవ్ చేసిన వ్యాఖ్యలు కూడా ముందస్తు హౌస్ అరెస్ట్‌కు కారణమయ్యాయి. శ్రీసత్యసాయి జిల్లా రామగిరి మండలం పాపిరెడ్డిపల్లిలో లింగమయ్య ఆదివారం హత్యకు గురైన విషయం తెలిసిందే. ఈ క్రమంలో సోమవారం ఆ గ్రామానికి నాయకులు, కార్యకర్తలతో కలిసి వెళ్లేందుకు గోరంట్ల మాధవ్ సిద్ధమయ్యారు. వన్‌టౌన్ సీఐ రాజేంద్రనాథ్ యాదవ్, నాలుగో పట్టణ సీఐ సాయినాథ్.. సిబ్బందితో మాధవ్ ఇంటి వద్దకు చేరుకున్నారు. అంతకుముందు మాధవ్ వీడియాతో మాట్లాడారు. గత ఐదేళ్లలో రామరాజ్యం నడిచిందనీ, నేడు రాష్ట్రం రావణ కాష్టం అయిందన్నారు. ప్రజలను మభ్యపెట్టి అధికారంలోకి వచ్చారన్నారు. ప్రజాసమస్యలను వదిలి వైసీపీ, ప్రజాస్వామ్య వాదులను అరెస్ట్‌లు, హత్యలు చేస్తున్నారని విమర్శించారు. అనంతరం పాపిరెడ్డిపల్లికి వెళ్తానని పట్టుబట్టారు. పోలీసులు అలా కుదరదని చెప్పి హౌస్ అరెస్ట్ చేశారు.

ఆస్పత్రి ఆవరణలో పటిష్ట భద్రత

లింగమయ్య మృతదేహనికి పోస్టుమార్టం నేపథ్యంలో జిల్లా కేంద్రంలోని సర్వజన ఆస్పత్రి వద్ద టూటౌన్ పోలీసుల ఆధ్వర్యంలో పటిష్ట బందోబస్తు నిర్వహించారు. ప్రధానంగా వైసీపీ నేతలు అక్కడికి వస్తే ఘర్షణ వాతావరణం తలెత్తే అవకాశముందని భావించిన పోలీసులు బారికేడ్లు ఏర్పాటు చేశారు. అక్కడికి వస్తారని భావించిన నేతలను ముందస్తుగా హౌస్ అరెస్ట్ చేశారు.


మార్చురీ గది వద్ద పోలీసుల భద్రత

ట్రెజరీలో చకచకా బిల్లులు

- ఉగాది, రంజాన్ సెలవు రోజుల్లోనూ కార్యకలాపాలు

అనంతపురం టౌన్, మార్చి 31(ఆంధ్రజ్యోతి): ఆర్థిక సంవత్సరం ముగింపు కావడంతో ఖజానా శాఖలో సందడి కనిపించింది. ఉగాది, రంజాన్ పండుగలు మార్చి నెలాఖరులో రావడంతో సెలవు రోజుల్లో కూడా ఆ శాఖ ఉద్యోగులు పనిచేయాల్సి వచ్చింది. ఆది, సోమవారాల్లో జిల్లాలోని ట్రెజరీ శాఖలు పనిచేశాయి. ప్రధానంగా కలెక్టరేట్‌లో ఉన్న ట్రెజరీ కార్యాలయం రెండురోజులుగా సందడిగా మారిది. గతంలో ప్రతి బిల్లూ ట్రెజరీల్లో పాస్ చేసి నేరుగా బ్యాంకులకు పంపించాల్సి ఉండేది. అపుడు సంబంధిత డబ్బును బ్యాంకులు ఆయా వ్యక్తుల ఖాతాల్లోకి జమచేసేవి. ప్రస్తుతం ఆ పరిస్థితి లేదు. వచ్చిన బిల్లులను ట్రెజరీ పరిశీలించి ఆమోదం వేసి సీఎఫ్ఎంఎస్‌లోకి పంపుతుంది. అక్కడ వాటికి ప్రభుత్వం ఆమోదం వేస్తే.. బిల్లులకు బ్యాంకులు డబ్బులు విడుదలచేసి ఖాతాల్లోకి జమచేస్తాయి. ప్రస్తుతం కేవలం సీఎఫ్ఎంఎస్‌లోకి అప్‌లోడ్ చేయడమే కావడంతో ట్రెజరీ శాఖ సిబ్బంది నిరంతరాయంగా కార్యకలాపాలను కొనసాగించారు. అన్ని ప్రభుత్వ శాఖల నిధులు, వివిధ పథకాల పనులు, జీతాలు, అరియర్స్ బిల్లులకు సంబంధించిన బిల్లులు రావడంతో వాటిని పరిశీలించి ప్రభుత్వ ఆమోదం కోసం సీఎఫ్ఎంఎస్‌లోకి నమోదు చేసి పంపించామని ట్రెజరీ అధికారులు తెలిపారు.


అనంత కలెక్టరేట్‌లో రంజాన్ సెలవురోజు తెరచుకున్న ఖజానా కార్యాలయం

న్యూస్ బాక్స్

బాధిత కుటుంబానికి ఆర్థికసాయం

ధర్మవరం, మార్చి 31(ఆంధ్రజ్యోతి): స్థానిక రాంనగర్‌కు చెందిన పూజారి మోహన్ భార్య ప్రమీలమ్మ అనారోగ్యంతో సోమవారం మరణించారు. దీంతో పట్టణ చేనేత ఐక్యవేదిక కమిటీ సభ్యులు వారికి రూ.12 వేలు ఆర్థిక సాయం అందజేశారు. ఇందులో 39వ వార్డు టీడీపీ ఇన్‌చార్జ్ కేతాశ్రీనివాసులు, టీడీపీ పట్టణ అధ్యక్షుడు పరిశే సుధాకర్, తొగటవీర క్షత్రియ సంఘం పట్టణ అధ్యక్షుడు గుద్దిటి రామచంద్ర, నాయకులు కేశవ, వీహెచ్‌పీ నాయకులు వేణు గోపాల్, వాసుదేవ, మనోహర పాల్గొన్నారు.

వైభవంగా లక్ష్మీనరసింహుడి గ్రామోత్సవం


స్వామివారిని ఊరేగిస్తున్న గ్రామస్థులు

తాడిమర్రి, మార్చి 31(ఆంధ్రజ్యోతి): మండలంలోని ఏకపాదంపల్లి గ్రామంలో సోమవారం లక్ష్మీనరసింహస్వామి గ్రామోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. గ్రామస్థులందరూ ఉదయం నుంచి సాయంత్రం వరకు ఆలయ ప్రాంగణంలోనే వంట చేసుకుని అక్కడే వన భోజనం చేశారు. సాయంత్రం ఐదు గంటల తరువాత స్వామి ఉత్సవ మూర్తులను అలంకరించుకుని గ్రామంలో ఊరేగించారు. వనభోజనానికి ఉపయోగించిన వంటసామగ్రిని ఎత్తుకుని స్వామి వారి ముందు నడుస్తూ ప్రజలందరు వారి వారి ఇళ్లకు చేరుకున్నారు. ఈ ఏడాది గ్రామంలో ఎలాంటి సమస్యలూ రాకుండా ప్రజలంతా సుభిక్షంగా ఉండాలని ప్రార్థించారు.

రాత్రి సమయాల్లో ఆంక్షలు

కదిరి, మార్చి 31(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని అన్ని దుకాణాలు, ఇతర వాణిజ్య సముదాయాలన్ని ఇక నుంచి రాత్రి 10 గంటలకే మూసివేయాలని పట్టణ సీఐ నారాయణ రెడ్డి ప్రకటనలో తెలిపారు. శ్రీలక్ష్మీనరసింహస్వామి బ్రహ్మోత్సవాలు, రంజాన్ మాస దీక్షలు ఉన్న దృష్ట్యా కొంత సడలింపు ఇచ్చామన్నారు. ఈ రెండు పండుగలు ముగిసిన దృష్ట్యా రాత్రి సమయాల్లో ఆంక్షలు యధావిధిగా కొనసాగుతాయని అన్నారు. రాత్రి 10 గంటల తరువాత ప్రజలు అవసరముంటేనే బయటకు రావాలని, రాత్రుల్లో రోడ్డు మీద జులాయిగా కనిపిస్తే కౌన్సెలింగ్ ఇస్తామని హెచ్చరించారు.

నేడు సంత వేలం

ఓబుళదేవరచెరువు, మార్చి 31(ఆంధ్రజ్యోతి): గతంలో వాయిదా పడ్డా ఓడీచెరువు వారపు సంత వేలం పాటను మంగళవారం నిర్వహిస్తున్నట్లు పంచాయతీ కార్యదర్శి శ్రీకాంత్ తెలిపారు. ఉదయం 11 గంటలకు గ్రామ పంచాయతీ కార్యాలయంలో ఈ వేలం పాట నిర్వహిస్తామన్నారు. వారపు సంత వేలం పాటే వారు. రూ. 50 వేలు, లోడింగ్, అన్‌లోడింగ్‌కు రూ.20 వేలు దరావత్తు చెల్లించి పాల్గొనాలని తెలిపారు.

రాములోరి కల్యాణానికి విరాళాల సేకరణ


విరాళాలు సేకరిస్తున్న ఆలయ కమిటీ సభ్యులు

ధర్మవరంరూరల్, మార్చి 31(ఆంధ్రజ్యోతి): స్థానిక రామ్‌నగర్‌లోని కోదండరామస్వామి దేవాలయంలో ఈనెల 4 నుంచి 6వ తేదీ వరకు జరిగే కోదండరాముని కల్యాణమహోత్సవాన్ని నిర్వహించనున్నారు. ఈ వేడుకలకు అవసరమైన నిత్యావసర సరుకులు, విరాళాలను సేకరించడానికి ఆలయ కమిటీ సభ్యులు సోమవారం ఊరేగింపుగా ఇంటింటికివెళ్లి సేకరించారు. ఆలయ కమిటీ అధ్యక్షుడు పామిశెట్టి కృష్ణయ్య మాట్లాడుతూ... ఏటా స్వామి వారి కళ్యాణమహోత్సవానికి భక్తులందరికి భాగస్వామ్యం ఉండాలని ఈ కార్యక్రమం చేపట్టామన్నారు. 26 సంవత్సరాలుగా ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామన్నారు. అదేవిధంగా 26వ ఆలయ వార్షికోత్సవాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఆలయకమిటీ బృందం చందా రామాంజినేయులు, పూజారి ఆదినారాయణ, కార్యదర్శి రంగన్న, వెంకట రమణ, పూజారి లక్ష్మీనారాయణ, చిన్న శ్రీనివాసులు పాల్గొన్నారు.

వినాయక కూచిపూడి నృత్యాలయానికి అవార్డులు

ధర్మవరం, మార్చి 31(ఆంధ్రజ్యోతి): స్థానిక వినాయక కూచిపూడి నృత్యాలయ కళాకారులకు ఐదు స్వర్ణమంజరి అవార్డులు వరించినట్టు గురువు శ్రీలేఖ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. గత నెల 29న హైదరాబాద్‌లోని భువనగిరిలో స్వర్ణగిరి వెంకటేశ్వర స్వామి ఆలయంలో వాగ్దేవి వాద్యసంగీత కళానృత్య సంస్కృతి సంస్థ వారు శ్రీవిశ్వావసు నామ సంవత్సరం ఉగాది పురష్కారాలను అందజేశారన్నారు. అందులో భాగంగా ధర్మవరం పట్టణం వినాయక కూచిపూడి నృత్యాలయానికి చెందిన కళాకారులు సునీత, అమృత, హేమావతి, నవ్యశ్రీ, వన్యశ్రీకు అవార్డులు వచ్చాయని తెలిపారు.


తహసీల్దార్ కార్యాలయం పక్కనే ఉన్న చెత్త కుప్ప

అపరిశుభ్రంగా తహసీల్దార్ కార్యాలయం

చెత్తాచెదారంతో నిండిన ఆవరణం

ధర్మవరంరూరల్, మార్చి 31(ఆంధ్రజ్యోతి): స్థానిక తహసీల్దార్ కార్యాలయ ఆవరణంలో ఎక్కడా చూసిన చెత్తాచెదారం కనిపిస్తోంది. కొత్త కార్యాలయం పక్కనే చెత్తచెదారం వేస్తున్నారు. కార్యాలయం పక్కనే కుప్పలు.. కుప్పలుగా చెత్తను వేయడంతో.. ఆ ప్రాంతమంతా అపరిశుభ్రంగా మారింది. అదేవిధంగా కార్యాలయంలోని చెట్ల ఆకులు రాలిపోవడంతో అవి దిబ్బలు దిబ్బలుగా ఏర్పడ్డాయి. స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమంలో భాగంగా చుట్టూ పరిశరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని ప్రజలకు చెబుతున్న అధికారులు.. వారి కార్యాలయాలే ఇలా అపరిశుభ్రంగా ఉంచుకోవడం విడ్డూరం. అధికారులు స్పందించి కార్యాలయం చుట్టూ ఉన్న అపరిశుభ్రతను తొలగించేలా చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.


కార్యాలయం పక్కన పడిన ఆకులు

అరచేతిలో శక్తి ఆయుధం

మహిళలు, బాలికలకు ఇక పూర్తి రక్షణ

రాష్ట్ర ప్రభుత్వం వినూత్న ప్రయోగం





పుట్టపర్తిరూరల్, మార్చి 31(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో మహిళలు, బాలికల రక్షణే ప్రథమ ధ్యేయంగా రాష్ట్రప్రభుత్వం పలు కార్యక్రమాలను చేపడుతోంది. ఇందులో భాగంగానే అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా రాష్ట్రప్రభుత్వం రాష్ట్ర వ్యాప్తంగా శక్తి యాప్‌ను అమలులోకి తీసుకొచ్చింది. ఈనెల 11 నుంచి సెల్‌ఫోన్లలో ఈ యాప్‌ను ఇన్‌స్టాల్ చేసే ప్రక్రియకు పోలీసుశాఖ శ్రీకారం చుట్టింది. గత వైసీపీ ప్రభుత్వంలో అమలులో ఉన్న దిశయాప్‌లో ఉండే సదుపాయాలను మరింత ఆధునీకరించడంతో మరిన్ని సేవలను పెంచుతూ సరికొత్త సాంకేతిక పరిజ్ఞానం జోడించి ఈ శక్తి యాప్‌ను ఆవిష్కరించారు. మహిళలు రాత్రి సమయాలల్లో ప్రయాణ సౌకర్యాలు అందుబాటులో లేక ఉండిపోవాల్సి వస్తే వారికి వసతి సౌకర్యం కల్పించేలా పోలీసులు చొరవ చూపే అవకాశం ఈ యాప్ వల్ల సాధ్యమవుతుంది. ఈ యాప్ మహళలు, బాలికలకు భద్రతకు అత్యంత ప్రాధాన్యం ఇచ్చేలా రూపకల్పన చేశారు. రాత్రివేళల్లో మహిళలు, యువతులు ఉద్యోగాలు చేసుకునేవారు, విద్యార్థినులు, ఎవరికి ఎలాంటి ఇబ్బందులు పడకుండా ఈ యాప్ ద్వారా రక్షణ కల్పించారు. ఎవరైనా మహిళలు కాని.. విద్యార్థినులు కాని ఎలాంటి ఇబ్బందులు వచ్చినా ఈ యాప్ ద్వారా సమాచారం ఇస్తే పోలీసులు క్షణాల్లో సంఘటనా స్థలానికి వారికి రక్షణ కల్పిస్తారు. జిల్లావ్యాప్తంగా శక్తియాప్ పై ప్రజల్లో అవగాహన కల్పించేలా పోలీసులు విస్తృతంగా కార్యక్రమాలు చేపడుతున్నారు.

● రక్షణ పొందిండి ఇలా...

శక్తియాప్ డౌన్‌లోడ్ చేసుకోవాలంటే గూగుల్ ప్లేస్టోర్‌కు వెళ్ళి యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకోవాలి. తర్వాత సెల్ ఫోన్ నెంబరు నమోదుచేసి లాగిన్ అవ్వాలి. ఓటీపీ ఎంటర్ చేసి వెరిఫై చేస్తే వ్యక్తి గత సమాచారాన్ని నమోదు చేసి సబ్మిట్ చేయాలి. ఈ యాప్‌లో నేరుగా పోలీసులకు ఫిర్యాదు చేయవచ్చు. రాత్రి వేళల్లో ఏవైనా ఇబ్బందులు తలెత్తి వసతి కావాలన్నా పోలీసుల సాయం పొందవచ్చు. బాలికలైనా మహిళలైనా అదృశ్యమైనా ఇందులో తక్షణమే ఫిర్యాదు చేయవచ్చు. అసాంఘిక కార్యకలాపాలను పోలీసుల దృష్టికి తీసుకెళ్లవచ్చు. ఫ్యామిలీ కౌన్సెలింగ్, సురక్షిత ప్రయాణం కోసం మనసమాచారాన్ని పోలీసులకు అందచేస్తే వారు జియోట్యాగ్ ద్వారా మనపై నిఘా వేసి రక్షణ కల్పిస్తారు. వాట్సాప్ ద్వారా కూడా సేవలను పొందవచ్చు. ఇలా శక్తి యాప్ మహిళలు బాలికల చేతిలో ఉంటే భద్రత పటిష్టంగా అమలు జరిగే విధంగా ప్రభుత్వం చర్యలు చేపట్టింది


శక్తియాప్‌పై అవగాహన కల్పిస్తున్న మహిళా కానిస్టేబుల్

సెల్ షేక్ చేస్తే చాలు



ఆపద సమయంలో మహిళలు పోలీసులకు సమాచారం అందించడానికి శక్తి యాప్ పనిచేస్తుంది. అటువంటి సమయాల్లో కేవలం సెల్ ఫోన్ గాల్లో షేక్ చేస్తే వారున్న లొకేషన్, 10 సెకన్లలో ఆడియో, వీడియోలు పోలీసు స్టేషన్‌కు చేరుతాయి. తద్వారా పోలీసులు సకాలంలో స్పందించి మహిళల ఇబ్బందులకు కారుకులైన వ్యక్తులపై చర్యలు చేపట్టి మహిళలకు రక్షణగా నిలిచే అవకాశం ఉంటుంది. ప్రతి మహిళ, విద్యార్థిని స్వచ్ఛందంగా తమ సెల్‌ఫోన్లలో శక్తియాప్‌ను డౌన్లోడ్ చేసుకుని రిజిస్ట్రేషన్ చేసుకోవాలి. మహిళలు విద్యార్థినులు తాము ఆపదలో ఉన్నామని భావిస్తే ఎస్ఓఎస్ బటన్ ప్రెస్ చేయాలి. మా పోలీసులు వివిధ ప్రాంతాల్లో మఫ్టీలో ఉంటూ మహిళలకు రక్షణా నిలుస్తాయన్నారు.

-రత్న, ఎస్పీ

వన్నె తగ్గిన కాశ్మీరీ

నాడు దుకాణాలు కలకల.. నేడు వెలవెల

వంద నుంచి 40కి తగ్గిన షాపుల సంఖ్య

సత్యసాయి శతజయంతిపైనే ఆశలు


కాశ్మీరీ దుకాణం

పుట్టపర్తి, మార్చి 31(ఆంధ్రజ్యోతి): ప్రపంచ ఆధ్యాత్మిక కేంద్రమైన పుట్టపర్తిలో కశ్మీరీ దుకాణాలకు.. వారి వ్యాపారాలకు ఒక ప్రత్యేక స్థానం ఉండేది. దశాబ్దాల క్రితం కశ్మీర్ నుంచి వందకు పైగా కుటుంబాలు పట్టపర్తికి వలస వచ్చి దుకాణాల ద్వారా జీవనం సాగిస్తున్నాయి. కాశ్మీరీ షాపులు దేశవిదేశీ కొనుగోలుదారులతో కిటకిటలాడేవి. వ్యాపారాలు సైతం చాలా జోరుగా సాగేవి. సత్యసాయి శివైక్యం తరువాత పర్యాటకు రాక తగ్గడంతో.. వీరి వ్యాపారాలూ తగ్గాయి. షాపుల సంఖ్య... వ్యాపారుల సంఖ్య.. తగ్గుతూ వచ్చింది.

● నాడు వందకు పైగా దుకాణాలు..

కాశ్మీరీ దుకాణాల్లో కాశ్మీరీ స్టైల్ ఆభరణాలు, ఉలన్ స్టాల్స్, నగిశీ వస్తువులు, పురాతన బొమ్మలు, విగ్రహాలు, స్టోన్స్‌తో పాటు పంజాబీ డ్రస్సులు బాగా అమ్ముడుపోయేవి. వ్యాపారులు ఢిల్లీ.. కాశ్మీర్, లాహోర్ నుంచి వివిధ రకాల వస్తువులు చెప్పి.. ఇక్కడ వ్యాపారాలు చేసుకునేవారు. వందకు పైగా షాపులు ఏర్పాటుచేసుకుని బా గా వ్యాపారంతో జీవనం సాగించేవా రు. సత్యసాయి శివైక్యం తరువాత వ్యా పారులు కొందరు ఇతర ప్రాంతాలకు వలస పోయారు.

కొనుగోలు దారులు లేక ప్రస్తుతం 40 షాపులే మిగిలాయి. అవి కూడా కొనుగోలుదారులు లేక వెలవెల బోతున్నాయి.


వస్త్రంపై కళాఖండం


కృష్ణుడి విగ్రహం

అద్దెలు భారగా మారాయి



దాదాపు మూడు దశాబ్దాలుగా ఇక్కడే వ్యాపారం చేస్తున్నా. గతంలో ఇళ్లు, షాపు అద్దె తక్కువగా ఉండేది. వ్యాపారం బాగా జరిగేది. ఐదేళ్లగా ఇళ్లు, షాపు అద్దెలు బాగా పెరిగాయి. ఆదాయం తగ్గింది. కొనుగోలుదారులు లేక వ్యాపారాలు లేవు. ఊరు విడిచిపెట్టలేక అలాగే నెట్టుకొస్తున్నా.

- షాహీద్, వ్యాపారి

సాయి శతజయంతిపైనే ఆశలు



14 సంవత్సరాలుగా ఇక్కడ వ్యాపారం చేస్తున్నా. కరోనా కష్టకాలంలో సైతం కొంత మేర వ్యాపారం బాగానే సాగింది. మూడు సంవత్సరాలుగా వ్యాపారాలు లేవు. ఖర్చులు పెరిగాయి. జిల్లా కావడంతో అద్దెలు మరింత పెరిగాయి. సత్యసాయి శత జయంతికి భక్తులు బాగా వచ్చి వ్యాపారం పెరుగుతుందన్న ఆశగా ఉంది. అదీ లేకపోతే మేం కూడా ఇతర ప్రాంతాలకు వలస వెళ్లకతప్పదు.

-ఇర్ఫాన్, వ్యాపారి

స్థానికుల సహకారం బాగుంది

నేను మూడు దశాబ్దాల క్రితం పుట్టపర్తికి వలస వచ్చాను. నేడు వ్యాపారం ఎలా ఉన్న ప్రశాంత జీవనం మాత్రం సాగుతోంది. స్థానికంగా అందరి మద్దతు... సాహకారం.. బాగుంది. గతంలో వ్యాపారాలు బాగా సాగాయి. ప్రస్తుతం అన్నింటితో పాటు అద్దెలు.. ధరలు పెరిగాయి. అయినా ఇక్కడే ఉండాలని అనిపిస్తోంది.

- హిలాల్ అహమ్మద్, కాశ్మీరీ షాపుల సంఘం అధ్యక్షుడు


← కూచిపూడి నాట్యం చేస్తున్న కళాకారులు

అలరించిన నాట్య ప్రదర్శన

ధర్మవరం, మార్చి 31(ఆంధ్రజ్యోతి): ఉగాది సందర్భంగా స్థానిక కొత్తపేట వెంకటేశ్వరస్వామి ఆలయంలో లలిత నాట్యకళానికేతన్ నాట్య గురువులు, కళాకారులు ఆదివారం రాత్రి ప్రదర్శించిన నాట్య ప్రదర్శన ఆకట్టుకొంది. నాట్యగురువులు బాబూబాలాజీ, కమలాబ బాలాజీ, రామలాలిత్య శిష్యబృందం భరత నాట్యం, కూచిపూడి, అన్నమయ్య సంకీర్తనలకు నాట్యం చేశారు.

ఆ మిర్రర్లతో ప్రమాదాలు సైడ్

బైక్‌లకు ఆ అద్దాలు లేకనే యాక్సిడెంట్లు



ముదిగుబ్బ, మార్చి 31(ఆంధ్రజ్యోతి): ఒకప్పుడు ప్రతి ద్విచక్రవాహనానికి తప్పనిసరిగా సైడ్ మిర్రర్లు ఉండేవి. కాని ప్రస్తుతం యువతీ, యువకులు వారి స్టైల్‌కు అడ్డు వస్తోందని, వాటిని ఉంచుకోవడం పాత ఫ్యాషన్ అని.. భావిస్తున్నారు. ద్విచక్ర వాహనాలకు అటు... ఇటు.. ఉండే అద్దాలను (రియర్ వ్యూ మిర్రర్లు) తొలగించేస్తున్నారు. దీనివల్ల ప్రమాదాలు కొని తెచ్చుకుంటున్నారు. ఒకరిని చూసి మరొకరు దీనిని అనుకరించడం పరిపాటిగా మారింది. ముదిగుబ్బ మండల కేంద్రంలో దాదాపు 50 శాతం బైక్‌లకు సైడ్ రియర్ వ్యూ మిర్రర్లు లేకపోవడంతో రోడ్డు ప్రమాదాలు అధికమయ్యాయి. ద్విచక్ర వాహనాలకు ఆ అద్దాలు లేకపోవడంతో.. వెనుక వస్తున్న వాహనాలను గుర్తించలేక.. సైడ్ తిరిగినప్పుడు ప్రమాదాల బారిన పడుతున్నారు. ఆటోలు, ట్రక్కులు, బస్సులు, లారీలకే కాదు ద్విచక్ర వాహనాలకు కూడా సైడ్ మిర్రర్‌లు చాలా అవసరం. వాహనం నడిపేటప్పుడు, యూటర్న్ తీసుకోవడం, ఓవర్‌టేక్ చేసే సమయంలో వీటి తో చాలా ప్రయోజనం ఉంటుంది. వెనుక నుంచి ఎటువంటి వాహనం వస్తోం ది... దాని వేగం ఎంత అనేది వీటి ద్వారా స్పష్టంగా గుర్తించవ చ్చు. అద్దంలో కనిపించే దృ శ్యాలను అంచనా వేసుకొని సమయస్ఫూర్తితో బండిని నడపడం వల్ల ప్రమాదాల జరిగే అవకాశం ఉండదు.


సైడ్ మిర్రర్లులేని ద్విచక్రవాహనాలు

అవగాహన కల్పిస్తాం



వాహనాల తనిఖీ చేస్తున్న సమయంలో చాలా ద్విచక్ర వాహనాలకు సైడ్ మిర్రర్‌లు లేకపోవడాన్ని గుర్తించాం. వీరంతా యూ టర్న్ తీసుకొనేటప్పుడు వెనక్కు చూస్తూ వాహనాలు నడుపుతున్నారు. ఇలా వాహనాలు నడపడం చాలా ప్రమాదకరం. ఇలాంటి పొరపాట్లు జరగకుండా ప్రజలకు, యువకులకు సైడ్ మిర్రర్లు, ట్రాఫిక్ నియమాలపై అవగాహన కల్పిస్తాం.

- సీఐ శివరాముడు, ముదిగుబ్బ

భక్తిశ్రద్ధలతో రంజాన్

ఆంధ్రజ్యోతి, న్యూస్ నెట్‌వర్క్: పుట్టపర్తి, ధర్మవరం, కదిరి నియోజకవర్గాల్లో ముస్లింలు భక్తిశ్రద్ధలతో రంజాన్ పండుగను సోమవారం జరుపుకున్నారు. ఆయా ఈద్గాలకు ర్యాలీగా వెళ్లి.. సామూహిక ప్రార్థనలు చేశారు. అనంతరం రంజాన్ శుభాకాంక్షలు తెలుపుకున్నారు.


కదిరి : ప్రార్థనలో పాల్గొన్న ఎమ్మెల్యే కందికుంట


ధర్మవరం: ప్రార్థనలో పాల్గొన్న పరిటాల శ్రీరామ్, చిలకం


ధర్మవరం: రంజాన్ తోఫా, నగదు అందజేస్తున్న చిలకం, టీసీ వరుణ్


నంబులపూలకుంట : ధనియానిచెరువులో జాతీయ జెండాలతో ర్యాలీ


ముదిగుబ్బ: ఈద్గాకు వెళ్తున్న ముస్లింలు


తాడిమర్రిలో...


బుక్కపట్నంలో..


కొత్తచెరువు: ఈద్గామైదానంలో ప్రార్థనలు


నల్లమాడలో..


గాండ్లపెంటలో...


ఓబుళదేవరచెరువులో..

143 గోకులం షెడ్లు నిర్మించాం

- ఎం.లక్ష్మీనారాయణ, ఏపీడీ



ఆంధ్రజ్యోతి ఇంటర్వ్యూ

మడకశిర, మార్చి 31 (ఆంధ్రజ్యోతి): నియోజకవర్గానికి 213 గోకులషెడ్లు మంజూరైతే అందులో 143 నిర్మాణాలు పూర్తయినట్లు ఏపీడీ లక్ష్మీనారాయణ తెలిపారు. మిగిలినవి వివిధ దశలలో ఉన్నాయన్నారు. ఉపాధిహామీ పథకం ద్వారా రోజూ 4000 మంది కూలీలకు పనులు కల్పిస్తున్నట్లు ఉపాధిహామీ పథకం ద్వారా గ్రామాలో పశువులు నీరు తాగేందుకు 250 గ్రామాల్లో నీటి తొట్టెలను ఏర్పాటు చేశారు. బుధవారం ఆయన ఆంధ్రజ్యోతితో మాట్లాడారు.

ప్రశ్న: నియోజకవర్గంలోని ఐదు మండలాలకు ఎన్ని మినీ గోకులం షెడ్లు మంజూరయ్యాయి?

జవాబు : ఉపాధిహామీ పథకం ద్వారా నియోజకవర్గంలోని 5 మండలాలకు 213 గోకులం షెడ్లు మంజూరయ్యాయి. ఒక్కో షెడ్డు నిర్మాణానికి రూ. 2,27లక్షలు మంజూరు అయింది. ఇప్పటివరకు 143 షెడ్డుల నిర్మాణాలు పూర్తయ్యాయి.

ప్రశ్న:నిర్మించుకున్న షెడ్లకు బిల్లులు చెల్లించారా?

జవాబు: పూర్తయిన షెడ్లకు ఆన్‌లైన్‌లో బిల్లులు అప్‌లోడ్ చేశాం. రూ.2.68 కోట్లదాకా బిల్లులు చెల్లించాల్సి ఉంది. త్వరలోనే చెల్లిస్తాం.

ప్రశ్న: నియోజకవర్గంలో జాబుకార్డులు ఎన్ని ఉన్నాయి?

జవాబు: నియోజకవర్గంలో 41,769 జాబ్‌కార్డులు ఉన్నాయి. 56వేలమంది కూలీలు ఉన్నారు. అందులో పనులకు వచ్చేవారు 14వేలమంది ఉన్నారు.

ప్రశ్న: ఉపాధిహామీ పథకం ద్వారా రోజూ ఎంతమంది కూలీలకు పనులు కల్పిస్తున్నారు?

ఊవాబు: ఉపాధిహామీ పథకం ద్వారా రోజూ 4 వేల మంది కూలీలకు పనులు కల్పిస్తున్నాం. ఆరువారాలకు సంబంధించి కూలీలకు బిల్లులు చెల్లించాల్సి ఉంది.

ప్రశ్న: ఏఏ పనులద్వారా కూలీలకు పనులు కల్పిస్తున్నారు?

జవాబు: ఫాంపాండ్లు, ట్రెంచ్‌ల ద్వారా పనులు కల్పిస్తున్నాం, నీళ్లకు, గడ్డపార పదును పెట్టించుకోవడానికి ఇచ్చే బిల్లుల్లోనే కలిపి కూలీలకు చెల్లిస్తున్నాం.

న్యూస్ బాక్స్

ఉనికిని కాపాడుకునేందుకే ఎమ్మెల్యేపై విమర్శలు

- టీడీపీ రాష్ట్ర కార్యదర్శి డాక్టర్ శ్రీనివాసమూర్తి

మడకశిరటౌన్, మార్చి 31(ఆంధ్రజ్యోతి): వైసీపీ తమ ఉనికిని కాపాడుకోవడానికి స్థానిక ఎమ్మెల్యే ఎంఎస్ రాజుపై ఆ పార్టీ నాయకులు విమర్శలు చేస్తున్నారని టీడీపీ రాష్ట్ర కార్యదర్శి డాక్టర్ శ్రీనివాసమూర్తి అన్నారు. సోమవారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ నియోజకవర్గంలో వైసీపీలో వర్గపోరు తారస్థాయికి చేరిందన్నారు. అంతర్గత పోరులో పైచెయ్యి సాధించడానికి తమ ఉనికిని కాపాడుకోవడానికి సమన్వయకర్త ఈరలకప్ప ఎమ్మెల్యేపై విమర్శలు చేశారన్నారు. రాష్ట్ర ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక అభివృద్ధి జరుగలేదని అనడం అవాస్తమని, 9 నెలల కాలంలోనే వందకు పైగా తాగునీటి బోర్లు వేయించామన్నారు. దాదాపు రూ.20 కోట్ల వ్యయంతో గ్రామీణ ప్రాంతాలలో సీసీరోడ్లు వేయించామని తెలిపారు. రూ.15 కోట్ల వ్యయంతో మడకశిర పట్టణంలో నేషనల్‌హైవే రహదారి పనులు, డ్రైనేజీ నిర్మాణం చేశారన్నారు. పట్టణంలో గార్మెంట్ పరిశ్రమలను పునఃప్రారంభించి మూడువేల మందికి ఉపాధి చూపారన్నారు. రైతుల సమస్యల పరిష్కారం కోసం వంద ట్రాన్స్‌ఫార్మర్లను పంపిణీ చేశారని, ముఖ్యమంత్రి సహాయనిధి కింద రూ.60 కోట్ల ఆర్థిక సహాయం అందించారన్నారు. ఇంత కన్నా అభివృద్ధి ఏమి చేయాలో చూపించాలని ప్రశ్నించారు. ఇప్పటికైనా వైసీపీ నాయకులు ఆత్మవిమర్శ చేసుకోవాలని నిర్మాణాత్మక ప్రతిపక్షంగా పనిచేయాలని హితవు పలికారు.

నేడు పింఛన్ల పంపిణీ

గుడిబండ, మార్చి 31(ఆంధ్రజ్యోతి): మండలంలోని ఎస్ రాయాపురం గ్రామంలో మంగళవారం ఎమ్మెల్యే ఎంఎస్ రాజు, మాజీ ఎమ్మెల్సీ గుండుమల తిప్పేస్వామి, రాష్ట్ర కార్యదర్శి శ్రీనివాసమూర్తి చేతుల మీదుగా ఎన్‌టీఆర్ భరోసా పింఛన్లను పంపిణీ చేయనున్నట్లు టీడీపీ మండల కన్వీనర్ మద్దనకుంటప్ప తెలిపారు. కార్యక్రమానికి టీడీపీ నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున హాజరై విజయవంతం చేయాలని ఆయన కోరారు.

ఘర్షణలో ముగ్గురిపై కేసు నమోదు

సోమందేపల్లి, మార్చి31(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రలోని గీతానగర్‌లో ఆదివారం రాత్రి జరిగిన ఘర్షణలో ముగ్గురిపై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ రమేష్ తెలిపారు. గీతానగర్‌లో బైక్‌పై వెళ్తున్న తేజా, విజయ్‌కుమార్, కిరణ్‌లు తమకు దారి ఇవ్వలేదని వేణుగోపాల్ అనే వ్యక్తితో గొడవకు దిగారు. మాటా మాటా పెరిగి తీవ్ర వాగ్వాదం చోటు చేసుకోవడంతో వేణుగోపాల్, కుటుంబ సభ్యులపై భౌతికంగా దాడి చేసి గాయపడిచారు. బాధితుడి ఫిర్యాదు మేరకు ముగ్గురుపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

ఆర్టీసీ బస్సు ఢీకొని ఒకరికి గాయాలు

పెనుకొండ రూరల్, మార్చి 31(ఆంధ్రజ్యోతి): ఆర్టీసీ బస్సు ద్విచక్రవాహనాన్ని ఢీకొన్న ఘటనలో గుట్టూరు గ్రామానికి చెందిన ఖాదర్‌సాబ్‌కు తీవ్ర గాయాలు కాగా మనవడు రెహాన్ స్వల్ప గాయాలతో బయటపడ్డాడు. కియ పోలీస్ స్టేషన్ ఎస్‌ఐ రాజేష్ తెలిపిన వివరాల మేరకు గుట్టూరు గ్రామానికి చెందిన ఖాదర్ సాబ్, అతని మనవడు మహ్మద్ రెహాన్ ద్విచక్రవాహనంలో రంజాన్ సందర్భంగా సమీపంలోని ఈద్గాకు వెళుతున్నాడు. వై జంక్షన్ వద్ద అనంతపురం నుంచి హిందూపురం వైపు వెళ్లే ఆర్టీసీ బస్సు ఢీకొంది. ప్రమాదంలో ఇద్దరు గాయపడ్డారు. స్థానికులు గమనించి గుట్టూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి, మెరుగైన వైద్య కోసం అనంతపురం తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఆవుపై చిరుత దాడి

గోరంట్ల, మార్చి 31(ఆంధ్రజ్యోతి): మండలంలోని ఎముకలగుట్లపల్లిలో రైతురాజశేఖర్‌రెడ్డికి చెందిన పాడి ఆవుపై సోమవారం రాత్రి చిరుతదాడి చేసి గాయపరిచింది. రైతు తెలిపిన మేరకు గ్రామం చివర వానవోలు రహదారి పక్కన ఇంటి ముందు మొద్దుకు ఆవును, పక్కనే దూడను కట్టివుచారు. బయటకు వెళ్లిన రైతు రాత్రి పొద్దుపోయాక ఇంటికి వచ్చాడు. సమీపంలోని పైపుల కుప్పపై ఆవు పడి ఉండటాన్ని గమనించాడు. ఆవు శరీరంపై అడవి జంతువు దాడిచేసిన గాయాలు, పొదుగు భాగం కొంత తినేసి ఉండటాన్ని గుర్తించి వెంటనే అటవీశాఖ అధికారులకు సమాచారం అందించాడు. ఆ శాఖ అధికారి రాహుల్ వెంటనే అక్కడికి చేరుకుని పరిశీలించారు. ఆవుపై ఉన్న గుర్తులను బట్టి దాడి చేసింది చిరుతగా నిర్ధారించారు. పశువైద్య సహాయకులు గంగాధర్ పరిశీలించి ఆవుకు ప్రాణాపాయం లేదన్నారు. కొంతకాలం చికిత్స అందిస్తే నయమవుతుందన్నారు. రూ.80 వేలు విలువ చేసే ఆవుకు పొదుగులేకుంటే ఉండీ ప్రయోజనం ఏముందని రైతు ఆవేదన వ్యక్తం చేశారు.

పట్టుచీరైనా ముట్టరంతే..!

- తీసుకుని పొలిమేర దాటలేరు
- మహిమాన్విత దేవి చౌడమ్మ
- కొటిపిలో నేడు బ్రహ్మరథోత్సవం



చౌడేశ్వరీదేవి ఆలయ ముఖద్వారం

హిందూపురం, మార్చి 31(ఆంధ్రజ్యోతి): సాధారణంగా ఎక్కడైనా పది రూపాయల వస్తువు బయట కనపడితే తీసుకెళతారు. అక్కడ రూ.50 వేలు విలువచేసే పట్టుచీర వేసినా, లేదా లక్ష రూపాయల ఆభరణమైనా తాకాలంటే జంకుతారు. ఒకవేళ తీసుకొని వెళితే పొలిమేర కూడా దాటలేరు. అంత మహిమాన్విత దేవి చౌడమ్మ అమ్మవారు. హిందూపురం మండలం కొటిపి గ్రామ చెరువు కట్టకు ఆనుకొని 500 ఏళ్ల క్రితం అమ్మవారి ఆలయం వెలిసింది. ఇక్కడ ఆలయం దినదిన అభివృద్ధి చెందుతూ భక్తుల పాలిట కొంగు బంగారంగా నిలుస్తోంది.



అమ్మవారి మూలవిరాట్టు

పొలిమేర దాటలేరు..

చౌడేశ్వరీ మాతకు ప్రతి మంగళ, శుక్రవారాల్లో ప్రత్యేక పూజలు జరుగుతాయి. అమ్మవారికి మొక్కుబడి ఉన్నవారు పొట్టేళ్లు, మేకలు, కోళ్లు బలి ఇస్తారు. జిల్లా నుంచే కాకుండా కర్ణాటక నుంచి ప్రతివారం వచ్చి మొక్కుబడి తీర్చుకుంటుంటారు. ఈ అమ్మవారికి హిందూపురం పట్టణ పరిధిలోని ముద్దిరెడ్డిపల్లి, ధర్మవరంతో పాటు మరికొన్ని ముఖ్యమైన ప్రాంతాల్లో ఉన్న పద్మశాలి మరికొన్ని కులస్థులకు కులదైవం. వారు వేలాది రూపాయల విలువచేసే పట్టుచీరలు అమ్మవారికి సమర్పిస్తారు. నూతనంగా మగ్గంలో తయారైన మొదటి చీరను అమ్మవారికి ఇవ్వడం ఆనవాయితీగా వస్తోంది. ఆ చీర విలువ ఎంతైనా అమ్మవారికి ఇస్తారు. తరువాత అమ్మవారికి సమర్పించిన చీరలను ఆలయం పక్కనే కుప్పగా వేస్తారు. కానీ అందులో ఉన్న చీరను తాకడానికి జంకుతారు. అవి ఎండకు ఎండి, వర్షానికి తడవాల్సిందే తప్పా వాటిని తీసుకునేందుకు ప్రయత్నించరు. ఎందుకంటే కొన్ని ఏళ్ల క్రితం అక్కడ అమ్మవారికి సమర్పించి బయట కుప్పలుగా ఉన్న చీరలను వేరే ప్రాంతానికి చెందిన వ్యాపారి వెళ్లి వాటిని కొనుగోలు చేస్తానని గ్రామస్థులతో మాట్లాడుకొని వేలంపాట పాడుకున్నాడు. కొంత మొత్తాన్ని అడ్వాన్స్‌గా చెల్లించాడు. తరువాత మిగిలిన మొత్తం చెల్లించి చీరలను తీసుకెళతానని సొంతూరికి బయలుదేరాడు. కానీ గ్రామ పొలిమేర దాటకుండా ఆయన అస్వస్థకు గురై కిందకు పడిపోగా కొటిపి గ్రామస్థులు గమనించి విషయం చెప్పారు. చేసిన తప్పును ఒప్పుకొని చీరలకు అడ్వాన్సుగా చెల్లించిన మొత్తాన్ని వదిలేస్తానని మొక్కుకోవడంతో అతని ఆరోగ్యం కుదుట పడింది. అప్పటి నుంచి అక్కడ ఏ వస్తువైనా వేలం వేయరు, కనీసం తాకడానికి భయపడే పరిస్థితి.



భక్తులు అమ్మవారికి సమర్పించిన చీరలు

నేడు అమ్మవారి బ్రహ్మరథోత్సవం

కొటిపిలో వెలిసిన అమ్మవారు ఎంతో మహిమాన్విత దేవి. ఇక్కడకు ప్రతి మంగళ, శుక్రవారాలతో పాటు పౌర్ణమి రోజున జాగరణ చేయడానికి వివిధ ప్రాంతాల నుంచి వందల సంఖ్యలో భక్తులు వస్తుంటారు. ముఖ్యంగా అనారోగ్యంతో బాధపడేవారు. సంతానం కోసం, ఆర్థిక ఇబ్బందులతో ఉన్న వారు. నూతన గృహ నిర్మాణం కోసం, ఉద్యోగాల కోసం ఆలయానికి వచ్చి జాగరణలో పాల్గొంటారు. ప్రతి పౌర్ణమికి వచ్చే భక్తుల కోసం కనీసం 7 నుంచి 10 క్వింటాళ్ల వరకు బియ్యం వేసి ప్రసాదంగా అందిస్తుంటారు. హుండీలో వచ్చిన ఆదాయం దేవదాయ శాఖకు ఇవ్వరు ఆలయ అభివృద్ధి కోసమే ఖర్చు చేస్తారు. ప్రతి ఏడాది కనీసం రూ.50 లక్షల నుంచి రూ. 70 లక్షలకు పైగా హుండీలో భక్తులు కానుకలగా వేస్తారు. అమ్మవారి బ్రహ్మరథోత్సవం ప్రతి ఏడాది ఉగాది పండుగ తరువాత వచ్చే మంగళవారం, లేదా శుక్ర, ఆదివారాల్లో జరపడం ఆనవాయితీగా వస్తోంది ఈ ఏడాది కూడా మంగళవారం బ్రహ్మరథోత్సవం జరగనుంది.

అగళి ప్రీమియర్ లీగ్ విజేత రావుడి

అగళి, మార్చి 31(ఆంధ్రజ్యోతి): జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జరిగిన ప్రీమియర్ లీగ్ విజేతగా రావుడి జట్టు నిలిచింది. ద్వితీయ స్థానం హళ్లికేరా జట్టు, తృతీయ స్థానాన్ని రామాపురం నిలిచింది. మొదటి బహుమతి రూ.30 వేలు నియోజకవర్గ గ్రీన్ భారత్ అధ్యక్షుడు కోడిపల్లి కామరాజు ప్రదానం చేశారు. ద్వితీయ బహుమతి రామాపురానికి చెందిన జట్టుకు రూ.10 వేలు అందించారు. గెలుపొందిన విజేత జట్లకు అవార్డులతో పాటు రివార్డులు మెమెంటోలను జడ్పీటీసీ ఉమేష్, గ్రీన్ భారత్ ఫౌండేషన్ అధ్యక్షుడు కామరాజు, ఎస్‌ఐ వీరేష్ అందజేశారు. ఎస్‌ఐ మాట్లాడుతూ గెలుపు ఓటములు సమానంగా స్వీకరించాలని, ఇలాంటి క్రీడలు సోదరభావానికి, స్నేహానికి దోహదం చేస్తాయని అన్నారు. కార్యక్రమంలో ఎంపీటీసీ రంగమ్మ పాల్గొన్నారు.



విజేత జట్టుకు ట్రోఫీని అందిస్తున్న జడ్పీటీసీ ఉమేష్, ఎస్‌ఐ వీరేష్

సమస్యల పరిష్కారానికే ప్రాధాన్యం: మంత్రి సవిత



నాయకులతో మాట్లాడుతున్న మంత్రి సవిత

పెనుకొండ టౌన్, మార్చి 31 (ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో సమస్యల పరిష్కారానికే తొలి ప్రాధాన్యం ఇస్తున్నామని మంత్రి సవిత అన్నారు. సోమవారం స్థానిక పార్టీ కార్యాలయంలో నాగినాయనచెరువు, గుడిపల్లి, తుంగోడు, వెలిదడకల, నడిమిపల్లి పంచాయితీ పరిధిలోని నాయకులతో మంత్రి సమావేశం నిర్వహించారు. గ్రామీణ ప్రాంతాల్లో ఉన్న సమస్యలను ఆరాతీశారు. అధికారం వచ్చిన 9 నెలల్లోపే గ్రామాల్లో అభివృద్ధి పనులు ప్రారంభించామని దశలవారిగా సమస్యలు పరిష్కరిస్తామని ఆమె తెలిపారు. ఏవైనా సమస్యలు ఉంటే తన దృష్టికి తీసుకురావాలన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో పార్టీ కోసం కష్టపడే కార్యాకర్తలకు తగిన గుర్తింపు గౌరవం ఇవ్వాల్సిన బాధ్యత అందిరిపై ఉందని అన్నారు. నీరుగంటి చంద్ర, మాజీ జడ్పీటీసీ వెంకటరమణ, టీవీ ఆంజనేయులు పాల్గొన్నారు.

సుంకాలు సరే.. వసతులు ఏవీ..?

- అసౌకర్యాల నడుమ వ్యాపారాలు
- పట్టించుకోని పంచాయతీ అధికారులు

సోమందేపల్లి, మార్చి 31(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో ప్రతివారం నిర్వహించే సంత మార్కెట్‌లో కాంట్రాక్టర్లు వ్యాపారుల నుంచి సుంకాలు వసూలు చేస్తున్నారే తప్ప వసతులు కల్పించడంలో విఫలమయ్యారని వ్యాపారులు ఆరోపిస్తున్నారు. ప్రభుత్వం నిర్ణయించిన ధరలకంటే కాంట్రాక్టర్లు అధికంగానే వసూలు చేస్తున్నట్లు ఆరోపణలు ఉన్నాయి. వారపు సంతనుంచి ఆదాయం పొందుతున్న పంచాయతీ అధికారులు వ్యాపారులకు సరైన వసతులు అందించడంలో విఫలం అవుతున్నట్లు విమర్శలున్నాయి. ప్రతి వారం సంతకు వివిధ ప్రాంతాలనుంచి వ్యాపారులు తరలివస్తారు. 600కుపైగా అంగళ్లు ఏర్పాటు చేశారు. పాతూరుకు వెళ్లే రహదారి, పెనుకొండ-గోరంట్ల రహదారితోపాటు ఎన్టీఆర్ సర్కిల్‌వరకు అంగళ్లను పెట్టుకుంటారు. వారు కాలకృత్యాలు తీర్చుకోవడానికి మరుగుదొడ్లులేవు. వేసవి కావడంతో ఎండలు మండిపోతున్నాయి. దాహార్తిని తీర్చుకోవడానికి నీటి వసతిని అధికారులు కల్పించడంలో విఫలమయ్యారు. ఆదాయంపై ఉన్న శ్రద్ధ వసతులు కల్పించడంలో లేదా అని వ్యాపారులు ప్రశ్నిస్తున్నారు. ఒక్కో అంగడికి రూ.1000 నుంచి రూ.1500, తోపుడుబండ్లకు రూ.150, ఆటోలకు రూ.300, గంపలు, చిన్న అంగళ్లకు రూ.100చొప్పున సుంకం వసూలు చేస్తున్నట్లు వ్యాపారులు చెబుతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి కనీస వసతులు కల్పించాలని వ్యాపారులు కోరుతున్నారు.



ఎన్టీఆర్ సర్కిల్ వరకు ఏర్పాటైన దుకాణాలు

కంకర పరిచారు.. రోడ్డు మరిచారు..!

- ఇబ్బంది పడుతున్న గ్రామాల ప్రజలు
- పట్టించుకోని పాలకులు, అధికారులు

అమరాపురం, మార్చి 31 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రం నుంచి విరుపసముద్రం వరకు 2019లో డబుల్ రోడ్డు నిర్మాణం మంజూరయింది. అప్పటిలోనే రూ.24కోట్లకు కాంట్రాక్టర్ టెండర్ దక్కించుకొన్నారు. రోడ్డుకు ఇరువైపులా ఉన్న కంపచెట్లు, పెద్ద చెట్లను తొలగించారు. ప్రొక్లయిన్‌లతో రోడ్డును చదును చేసి అమరాపురం నుంచి విరుపసముద్రం కర్ణాటక సరిహద్దు వరకు కంకర పరిచారు. అప్పటి వైసీపీ ఎమ్మెల్యే డాక్టర్ తిప్పేస్వామి ఆధ్వర్యంలో డబుల్ రోడ్డు నిర్మాణానికి భూమి పూజ కూడా చేశారు. అప్పటి ప్రభుత్వంలోనే రూ.8కోట్లు కూడా విడుదల అయింది. ఆ ఎమ్మెల్యే కమీషన్ కోసం కక్కుర్తి పడి అధికంగా నగదు డిమాండ్ చేయడంతో కాంట్రాక్టర్ డబ్బు ఇచ్చుకోలేక మధ్యలోనే వదిలి వేశారు. తిరిగి అదే కాంట్రాక్టర్ వచ్చి మరోసారి కంకర పరిచారు. అప్పటి ఎమ్మెల్యే మరలా కమీషన్ డిమాండ్ చేయడంతో ఏమీచేయలేక నిస్సహాయ స్థితిలో ఉండి రోడ్డు పూర్తి చేయకుండానే మధ్యలోనే వదిలి వెళ్లిపోయారు. బాగున్న రోడ్డును పెకలించడంతో చినుకుపడితే చిత్తడిగా మారిపోతుందని ప్రజలు అంటున్నారు. ప్రతినిత్యం వందల కొద్ది వాహనాలు తిరుగుతుంటాయని, అనేక సార్లు వాహన చోదకులు ప్రమాదానికి గురయ్యారని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ద్విచక్రవాహనంలో ప్రయాణం చేయాలంటే కష్టంగా ఉందని వాహనదారులు వ్యక్తం చేస్తున్నారు. గ్రామీణ ప్రాంతాల నుంచి విద్యార్థులు, ముసలివారు ప్రయాణం చేయాలంటే అతికష్టంగా ఉందని వాపోతున్నారు. రోడ్డు ఎగుడు దిగుడుగా మారిందని విద్యార్థులు ఆందోళన చెందుతున్నారు. వైసీపీ ప్రభుత్వ హయాంలో అభివృద్ధి అనేది శూన్యం. ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్న చందంగా అధికారులు, ప్రజాప్రతినిధులు నిర్లక్ష్యం వల్ల డబుల్ రోడ్డు నిర్మాణం ఆగిపోయిందని ప్రజలు విమర్శిస్తున్నారు. ఈ ప్రభుత్వమైనా స్పందించి రోడ్డును బాగు చేయాలని స్థానికులు కోరుతున్నారు.



కంకర పరిచి వదిలివేసిన అమరాపురం-విరుపసముద్రం రోడ్డు

మధ్యలోనే ఆపేశారు..



డబుల్ రోడ్డు వేసేందుకు ఉన్న రోడ్డును గుంతల మయంగా మార్చారు. ఈ ప్రభుత్వంలో అయినా రోడ్డును బాగు చేయాలి. నిత్యం ఈ రోడ్డులో ప్రయాణించాలంటే నరకంగా ఉంది. అధికారులు స్పందించి సమస్యను పరిష్కరించాలి.

-కృష్ణమూర్తి, విరుపసముద్రం

తారు రోడ్డుగా మార్చండి

తమ్మడేపల్లి నుంచి అమరాపురం వెళ్లే రోడ్డును తారు రోడ్డుగా మార్చాలి. రోడ్డు పూర్తిగా పాడైపోయి వర్షం వస్తే ప్రయాణానికి కష్టతరంగా మారింది. అధికారులు, ప్రజా ప్రతినిధులు స్పందించి వెంటనే తారు రోడ్డుగా మార్చాలి.

-శివలింగప్ప, తమ్మడేపల్లి

భక్తిశ్రద్ధలతో రంజాన్ ప్రార్థనలు

రంజాన్ పండుగను ముస్లింలు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. హిందూపురం, పెనుకొండ, గోరంట్ల తదితర పట్టణాలతో పాటు మండల కేంద్రాలు గ్రామాల్లో సోమవారం పవిత్ర రంజాన్‌ను పురస్కరించుకుని ఈద్గా, మసీదుల్లో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఒకరికొకరు ఆలింగనం చేసుకుని పండుగ శుభాకాంక్షలు తెలుపుకున్నారు.

శాంతి మార్గంలో పయనిద్దాం

హిందూపురం అర్బన్, మార్చి 31(ఆంధ్రజ్యోతి): మహ్మద్ ప్రవక్త చూపిన శాంతి మార్గంలో ప్రతి ఒక్కరూ పయనించాలని మౌలానా అబ్దుల్ మన్నాన్ అన్నారు. సోమవారం ఉదయం స్థానిక అల్‌హిలాల్ ఈద్గా మైదానంలో రంజాన్ పండుగ సందర్భంగా ఆయన ప్రజలనుద్దేసించి మాట్లాడాడు. దేశం, ప్రపంచం శాంతి యుతంగా ఉండాలంటే ప్రతి ఒక్కరూ దైవ చింతనతో మెలగాలన్నారు. ప్రార్థనల్లో ముతువల్లీ నూరుల్లాఖాన్, టీడీపీ మున్సిపల్ చైర్మన్ రమేష్‌కుమార్, జిల్లా అధ్యక్షుడు కొల్లకుంట అంజినప్ప, నాయకులు అమర్‌నాథ్, కిరికెర మాజీ మండల కన్వీనర్ హెచ్. ఎన్ రాము, లాయర్ శివశంకర్, రమణ, అంజాద్ పాల్గొన్నారు.



ఈద్ ముబాకర్ తెలుపుకుంటున్న చిన్నారులు



శుభాకాంక్షలు తెలుపుతున్న టీడీపీ నాయకులు



పెనుకొండలో ప్రార్థనల కోసం వస్తున్న ముస్లింలు



పెనుకొండలో సందేశాన్ని వినిపిస్తున్న ముతవల్లీ



పరిగిలో...



గోరంట్లలో...



మడకశిరలో...



అగళిలో ప్రార్థనలకు బయలుదేరిన ముస్లింలు

భక్తరహళ్లి ఆలయంలో పూజలు నిలిపివేత

మడకశిర రూరల్, మార్చి 31(ఆంధ్రజ్యోతి): మండలంలోని ప్రసిద్ధి చెందిన భక్తరహళ్లి నరసింహస్వామి, జిల్లేడగుంట ఆంజనేయస్వామి ఆలయాలు మూడు రోజుల పాటు పూజలు నిలిపివేస్తున్నాట్లు దేవదాయశాఖ ఈఓ నరసింహరాజు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. పై దేవాలయాల అర్చకుడు నారాయణప్ప సోమవారం ఉదయం మృతిచెందారు. దీంతో మూడు రోజులపాటు ఆలయాల్లో పూజలు నిలిపివేస్తున్నాట్లు తెలిపారు. 3వ తేదీ నుంచి పూజలు ప్రారంభించనున్నట్లు తెలిపారు. భక్తులు ఈ విషయాన్ని గమనించి సహకరించాలని ఆయన కోరారు.